WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ.. ప్రజాదరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేయుటకు జిల్లా ఇన్‌ఛార్జ్‌లు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన, తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
prabhathasuryudueditor@gmail.com
94940 54338
https://youtube.com/@PrabhathaSuryuduNews



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

ప్రచురణ :తెలంగాణ , సంపాదకులు :చెరుకు ఉపేందర్ , శనివారం - 31 - ఆగష్టు - 2024 ,
సంపుటి 01, సంచిక 355, పేజీలు -4 వెల రూ.5/-




## ఆధార్ ఉంటేనే తిరుమల లడ్డూలు.టీటీడీ క్లారిటీ !

తిరుపతి: తిరుమల శ్రీవారి ప్రసాదంపై టీటీడీ వివాదాస్పద నిర్ణయం తీసుకుందని నిన్నటి నుంచి వార్తలు వస్తున్నాయి. అయితే.. దీనిపై టీటీడీ పాలక మండలి క్లారిటీ ఇచ్చింది. ఇక తిరుమల వెళ్లే వారికి లడ్డూలు రెండే అంటూ నిన్న ఓ వార్త వైరల్ అయింది. గురువారం నుంచే అమల్లోకి.. అదనంగా కావాలంటే ఆధార్ తప్పనిసరి అంటూ కూడా కొన్ని మీడియాల్లో వార్తలు వచ్చాయి. ఒకసారి లడ్డూలు తీసుకుంటే తిరిగి నెలరోజుల తర్వాతే మళ్లీ అవకాశం అని కూడా ప్రచారం చేశారు. దళారులను అరికట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం చేశారు. తిరుమల శ్రీవారి ప్రసాదంపై టీటీడీ వివాదాస్పద నిర్ణయం తీసుకోలేదని తాజాగా క్లారిటీ ఇచ్చింది. అపోహలు, అవాస్తవాలు నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి. లడ్డూ విక్రయ విధానంలో ఎలాంటి మార్పు లేదని క్లారిటీ ఇచ్చారు. దర్శనం టికెట్లు, టోకెన్లు లేని భక్తులకు ఆధార్ కార్డు నమోదుతో రెండు లడ్డూలు విక్రయిస్తామని వివరించారు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి. దర్శన టికెట్, టోకెన్ కలిగిన భక్తులకు ఉచితంగా ఒక లడ్డూతో పాటు నాలుగు నుంచి ఆరు లడ్డూలు విక్రయిస్తామని క్లారిటీ ఇచ్చారు. సామాన్య భక్తులకు మేలు చేసే విధంగా లడ్డూ విక్రయ విధానం కొనసాగుతుందన్నారు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి.



## గణేష్ మండపాలకు రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్



హైదరాబాద్: గణేష్ ఉత్సవాల నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో గణేష్ మండపాల ఏర్పాటు, ఊరేగింపు నిర్వహించే విషయంలో కీలక సూచనలు చేశారు. అందరి సలహాలు, సూచనలు స్వీకరించడం కోసమే ఈ సమావేశం నిర్వహించామని సీఎం చెప్పారు. “గణేష్ నవరాత్రి ఉత్సవాలను సంబంధించి ప్రభుత్వానికి, నిర్వహకులకు మధ్య సమన్వయం ఉండాలి. నగరంలో ఎక్కడ ఉత్సవాలు నిర్వహించాలన్నా పోలీసుల అనుమతి తీసుకోవాలి. గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదు. దరఖాస్తులను పరిశీలించి మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశిస్తున్నా. చిత్తశుద్ధి, నిబద్ధతతో ఉత్సవాలు నిర్వహించేలా జాగ్రత్త వహించండి. నిమజ్జనానికి సంబంధించి ఉత్సవ నిర్వహకుల నుంచి సహకారం అవసరం. ఏరియాల వారీగా నిమజ్జనానికి సంబంధించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ప్రతీ ఏరియాలో కోఆర్డినేషన్ కమిటీలను నియమించుకోవాలి. వీవీఐపీ సెక్యూరిటీపై ప్రత్యేక దృష్టి సారించాలి. సెప్టెంబర్ 17 తెలంగాణకు చాలా కీలకమైంది. సెప్టెంబర్ 17న జరిగే రాజకీయ, రాజకీయేతర కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి. హైదరాబాద్ బ్రాండ్ ను మరింత పెంచేందుకు నిర్వాహకుల సహకారం అవసరం” అని రేవంత్ రెడ్డి సూచించారు. మిలాద్-ఉన్- నబీ ఏర్పాట్లపై కూడా సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు. ఈ సమీక్షకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్,ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ, ఉన్నతాధికారులు, వక్ఫ్ బోర్డు చైర్మన్, సభ్యులు, ఇతర ముస్లిం ప్రతినిధులు హాజరయ్యారు.

మూడు ప్రధాన అంశాలు

మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. మండపాల ఏర్పాటు, తొమ్మిది రోజుల ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనానికి సంబంధించి మండప నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం తరపున పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖతో పాటు ఇతర ముఖ్య శాఖల అధికారులు సైతం మండప నిర్వాహకులతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లకు తావివ్వద్దని హెచ్చరించారు. అవుటర్ రింగు రోడ్డు పరిధిలో గతేడాది 1.50 లక్షల విగ్రహాలు ఏర్పాటు చేశారనే లెక్కలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ముందుగా మండప నిర్వహకులు ఆన్లైన్లో, ఆఫ్లైన్లోనో అనుమతులు తీసుకోవాలని, అలా తీసుకోవడం వలన ఆయా ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ ఇతర ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. మొత్తం విగ్రహాలను హుస్సేన్ సాగర్కే కాకుండా ఇతర చెరువుల్లోనూ నిమజ్జనం చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సరూర్ నగర్తో పాటు పలు చెరువులు నీటితో ఉన్నాయని, ఏ ప్రాంతంలోని విగ్రహాలు ఆ ప్రాంతంలోని చెరువుల్లో నిమజ్జనం చేస్తే హుస్సేన్ సాగర్ వద్ద రద్దీ తగ్గడంతో పాటు ఆయా చెరువుల వద్ద నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం ముందుగానే చేసే వీలుంటుందన్నారు. ఈ విషయంలో ఉత్సవ సమితి సభ్యులు, మండప నిర్వాహకులు ముందగానే సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. నిమజ్జనానికి ముఖ్య అతిథులుగా ఎవరినైనా పిలిస్తే ముందుగానే ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని, అలాగే వీవీఐపీలు ఎవరైనా వచ్చే అవకాశం ఉంటే ముందుగా తెలియజేస్తే పోలీసు శాఖ వారి రాకపోకలకు రూట్ క్లియరెన్స్ చేయడంతో పాటు తగిన భద్రత ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిమజ్జన ఊరేగింపు త్వరగా ప్రారంభిస్తే త్వరగా కార్యక్రమాన్ని ముగించుకోవచ్చని, ఫలితంగా భక్తులు ట్రాఫిక్, ఇతర ఇబ్బందులు బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నగరం పరిధిలోని నలుగురు లోక్సభ సభ్యులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసులను ఆదేశించారు.

## టీటీడీ మాదిరి యాదగిరిగుట్టకు కూడా ప్రత్యేక బోర్డు: సీఎం రేవంత్ రెడ్డి

**టూరిజంపై నూతన విధానాన్ని రూపొందించాలన్న రేవంత్**
**ఎకో, టెంపుల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన**
**హైదరాబాద్ వెలుపల మరో జూపార్క్ అభివృద్ధికి ప్లాన్ తయారు చేయాలని ఆదేశం**



హైదరాబాద్: తెలంగాణలో ఇప్పటికే పలు అంశాలపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా టూరిజంపై ఫోకస్ చేశారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిపై నూతన విధానం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. హైదరాబాద్ బయట మరో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్ట (యాదాద్రి) అభివృద్ధిపై కీలక ఆదేశాలను ముఖ్యమంత్రి జారీ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు మాదిరి యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆలయ గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని చెప్పారు. ఆలయ అభివృద్ధి పెండింగ్ పనులు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన పనుల వివరాలను ఇవ్వాలని సూచించారు.

## పాకిస్తాన్ పర్యటనకు ప్రధాని మోదీ?

# ఆహ్వానం అందింది



ఢిల్లీ: ప్రతిష్ఠాత్మక షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ అత్యున్నత భేటీని ఈ ఏడాది పాకిస్తాన్ నిర్వహించబోతోంది. దీనికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రాజధాని ఇస్లామాబాద్.. ఈ సమ్మిట్‌కు ఆతిథ్యాన్ని ఇవ్వబోతోంది. అక్టోబర్ 15, 16 తేదీల్లో ఈ భేటీ ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎస్-సీఓలో సభ్యత్వం ఉన్న దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులు లేదా విదేశాంగ శాఖ మంత్రులు ఈ సమావేశానికి హాజరు కావడం ఆనవాయితీగా వస్తోంది. 2001లో షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ ఏర్పాటైంది. భారత్, చైనా, కజకిస్తాన్, కిర్గిజిస్తాన్, రష్యా, పాకిస్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ దేశాలకు ఇందులో సభ్యత్వం ఉంది. ఆఫ్ఘనిస్తాన్, బెలారస్, ఇరాన్, మంగోలియా.. అబ్జర్వర్ స్టేట్స్ హోదాలో కొనసాగుతున్నాయి. ఆర్మేనియా, అజర్‌బైజాన్, కాంబోడియా, నేపాల్, శ్రీలంక, టర్కీలకు డైలాగ్ పార్ట్‌నర్‌షిప్ ఉంది ఇందులో. సభ్య దేశాల మధ్య ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలనేది ఈ సమ్మిట్ ముఖ్య ఉద్దేశం. గత ఏడాది ఎస్సీఓ భేటీని భారత్ నిర్వహించింది. గోవాలో ఈ సమావేశం ఏర్పాటైంది. అప్పట్లో ఈ ఎస్సీఓ సభ్య దేశాల సమావేశానికి పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారి హాజరైన విషయం తెలిసిందే. కొన్ని సంవత్సరాల విరామం తరువాత పాకిస్తాన్‌కు చెందిన ఓ అత్యున్నత స్థాయి అధికారి లేదా మంత్రి భారత్‌లో అడుగు పెట్టడం ఇదే తొలిసారి. ఇప్పుడు పాకిస్తాన్ వంతు వచ్చింది. అక్టోబర్‌లో ఎస్సీఓ సమావేశాన్ని నిర్వహించడానికి ఏర్పాటు సాగిస్తోంది. సభ్య దేశాధినేతలు, ప్రధానమంత్రులకు ఆహ్వానాలను పంపిస్తోంది. ఈ క్రమంలో భారత్‌కూ ఆహ్వానం అందింది. ఎస్సీఓ భేటీకి హాజరు కావాలంటూ అధికారికంగా ఆహ్వానపత్రాలను పంపించింది. ఈ విషయాన్ని పాకిస్తాన్ విదేశాంగ శాఖ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ముంతాజ్ జెహ్రా బలోచ్ వెల్లడించారు. ప్రధాని మోదీకి ఆహ్వానాన్ని పంపించినట్లు ఆమె తెలిపారు. ఈ సమ్మిట్‌కు హాజరవుతామని కొన్ని సభ్య దేశాలు ధృవీకరించాయని, భారత్ ఇంకా తన నిర్ణయాన్ని తెలియజేయాల్సి ఉందని అన్నారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ హాజరవుతారా? లేదా? అనేది ఇంకా ఖరారు కావాల్సి ఉంది. గత ఏడాది భారత్‌లో జరిగిన సమావేశానికి పాకిస్తాన్ విదేశాంగ శాఖ మంత్రి హాజరైనందున, భాగస్వామ్య ధర్మాన్ని పాటించేలా కేంద్ర ప్రభుత్వం ఇందులో పాల్గొనడం దాదాపు ఖాయమైనట్టే. మోదీ వెళ్తారా? లేక విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌ను పంపిస్తారా? అనేది వేచిచూడాలి.

## ఎంపాక్స్ కొత్త, ప్రాణాంతకమైన వేరియంట్..

### పిల్లలకు ముప్పు!




ఢిల్లీ: ఆఫ్రికాలో వేగంగా విస్తరిస్తున్న ఎంపాక్స్ వైరస్‌కు సంబంధించి భయానక సమాచారం వెలుగులోకి వచ్చింది. కొత్త,. ప్రాణాంతకమైన ఎంపాక్స్ స్ట్రెయిన్-క్లేడ్ 1బి పిల్లలకు పెద్ద ముప్పుగా పరిణమించిందని నిపుణులు అంటున్నారు. ఎంపాక్స్ ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగస్టు 15న ‘గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ’గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ జాతి 2022 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా సృష్టించిన అలజడి కంటే భిన్నమైనది. ఇది తక్కువ ప్రమాదకరం. ఈ వైరస్ ప్రధానంగా ఇతర పురుషులతో లైంగిక సంబంధం కలిగి ఉన్న పురుషులలో కనిపిస్తుంది. అప్పటి నుంచి ప్రపంచ ఆరోగ్య సంస్థ 116 దేశాలలో పాక్స్ కారణంగా 99,176 కేసులు, 208 మరణాలను నివేదించింది. భారతదేశంలో ఇప్పటివరకు మొత్తం 30 కేసులు కనుగొనబడ్డాయి. దీని చివరి కేసు మార్చి 2024లో వెలుగులోకి వచ్చింది. ఈ సంవత్సరం ఆఫ్రికాలో కేసులు, మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2024లో ఇప్పటివరకు 15,600 కేసులు, 537 మరణాలు నమోదయ్యాయి. ఈ కొత్త జాతి ప్రధానంగా 2023 సెప్టెంబర్‌లో జంతువుల నుంచి మనుషులకు వ్యాపించిన క్లాడ్ 1%దీ% వల్ల ఏర్పడింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ యొక్క నేషనల్ కోవిడ్-19 టాస్క్ ఫోర్స్ కో-ఛైర్మన్ డాక్టర్ రాజీవ్ జయదేవన్ మాట్లాడుతూ.. ఈ జాతి వ్యాప్తి యొక్క సరళి 2022లో అనుభవించిన కేసులకు భిన్నంగా ఉందన్నారు. ఈసారి మహిళలు, చిన్నారులు సహా పెద్ద సంఖ్యలో వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. అయినప్పటికీ.. శారీరక సంబంధం లేదా లైంగిక సంబంధం కారణంగా ఎంపాక్స్ వ్యాపిస్తుందని గమనించబడింది.

పిల్లలపై ప్రభావం..

ఒక నివేదిక ప్రకారం.. పిల్లలలో ఈ వైరస్ కేసులు మునుపటి జాతిలో చాలా తక్కువగా ఉన్నాయి. అయితే ప్రస్తుత కాలంలో పిల్లలలో ఈ వైరస్ యొక్క అవకాశాలు పెరుగుతున్నాయి. ఫరీదాబాద్‌లోని అమృతా హాస్పిటల్‌లో ఇన్ఫెక్షియస్ డిసీజెస్ కన్సల్టెంట్ డాక్టర్ రోహిత్ గార్గ్ మాట్లాడుతూ.. “ఎంపాక్స్ పిల్లలకు పెద్ద ముప్పును కలిగిస్తుంది. పెద్దల కంటే పిల్లలలో ఎక్కువ కేసులు సంభవిస్తాయి. ఇటీవలి డేటా పిల్లలలో ఈ వైరస్ పెరుగుదలను సూచించింది. పిల్లలు పెద్దలకు ఒకే విధమైన లక్షణాలను సంభవిస్తాయి. కానీ తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొంటారు.” అని పేర్కొన్నారు.

## సాగర్‌కు భారీగా వరద.. 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల




గద్వాల/అయిజ/శ్రీశైలం/నందికొండ: కృష్ణా ప్రాజెక్టులకు మళ్లీ వరద పెరిగింది. గురువారం జూరాల డ్యాంకు ఇన్‌ఫ్లో 2,94,000 కూసెక్కులు నమోదు కాగా.. గురువారం జూరాల డ్యాంకు ఇన్‌ఫ్లో 2,94,000 కూసెక్కులు నమోదు కాగా.. అధికారులు 39గేట్లు తెరిచారు. దిగువకు 2,88,778 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి వరద పోటెత్తుతున్నది. ఇన్‌ఫ్లో 2,75,218 క్యూసెక్కులు వస్తుండగా.. 10 గేట్ల ను 10 అడుగుల మేర ఎత్తి 2,79,830 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద పోటెత్తుతున్నది. 2,57, 634 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండటం తో సాగర్‌డ్యామ్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 2,10, 600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రసుత్తం పూర్తిస్థాయికి చేరుకున్నది.

## ఏపీ కి కేంద్రం నుంచి నిధుల వరద..

- నిధుల రాకతో సీఎం చంద్రబాబు దూకుడు
- డబుల్ ఇంజిన్ సర్కారుతో.. కీలక ప్రాజెక్టులకు వడివడిగా అడుగులు
- టార్గెట్ ఫిక్స్ చేసుకుని.. పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ
- రాజధాని సహా.. ఏపీలో మౌలిక సదుపాయాల కల్పనకు 2400 కోట్లు
- ప్పటికే 1500 కోట్లు రిలీజ్
- నాలుగేళ్లు టార్గెట్‌గా పెట్టుకుని దశలవారీగా పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో.. ముందుకెళ్తుంది.



అమరావతి: కేంద్రం సహకారం ఏపీకి నూతనోత్తేజాన్ని ఇస్తుంది. డబుల్ ఇంజిన్ సర్కారుతో.. కీలక ప్రాజెక్టులకు వడివడిగా అడుగులు ముందుకు పడుతున్నాయి. టార్గెట్ ఫిక్స్ చేసుకుని.. పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది కూటమి ప్రభుత్వం. కేంద్రంలో చక్రం తిప్పే స్థాయిలో ఉండటంతో.. సీఎం చంద్రబాబు అడిగివన్నీ ఇచ్చేందుకు, విభజన హామీలు నెరవేర్చేందుకు.. పార్లమెంట్ వేదికగానే నిధుల వరద పారించింది. అమరావతికి 15వేల కోట్ల రుణం, అవసరాన్ని బట్టి అదనపు నిధులు ఇస్తామని బడ్జెట్‌లో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. రాజధానిలో పరుగులు పెట్టించేందుకు కేంద్ర రుణంపై ఫోకస్ చేసిన సీఎం చంద్రబాబు.. ఢిల్లీలోని పెద్దలను కలిసొచ్చారు. త్వరగా డబ్బులిప్పించాలని కోరడంతో.. వరల్డ్ బ్యాంక్, ఏషియా డెవలప్‌మెంట్ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి.. నిధుల విడుదలకు సూత్రప్రాయ అంగీకారం తెలిపి వెళ్లారు. ఇక రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య అంశాలలో రెండోది పోలవరం. 25వేల కోట్ల మొదటి దశ ప్రాజెక్టు అంచనాలలో ఇంకా రాష్ట్రానికి 12 వేల కోట్లు రావాల్సి ఉంది. వీటిపై ఇటీవలే ప్రధాని, హోంమంత్రి, జలవనరుల మంత్రిని సీఎం చంద్రబాబు కలిసి వచ్చారు. దీంతో.. బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పోలవరం నిధుల అంశాన్ని చేర్చి.. షెడ్యూల్ ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరం 6వేల కోట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరో 6 వేల 157కోట్లు చెల్లించేందుకు కేంద్ర కేబినెట్ తీర్మానం చేసింది. కేంద్రం నిధులు ఇస్తుండటంతో.. 2029లోపు పోలవరం కంప్లీట్ చేసేలా టార్గెట్ ఫిక్స్ చేసుకుంది. ప్రస్తుతం 990 కోట్లతో వచ్చే రెండు సీజన్లలోపే డయా ఫ్రమ్ వాల్ పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకుంది ప్రభుత్వం. ఈలోపే విశాఖకి తాగునీటితో పాటు పారిశ్రామిక అవసరాల కోసం ఎడమ కాల ద్వారా నీటిని అందించేందుకు అవసరమైతే లిఫ్టింగ్ కూడా చేయాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఇక విభజన హామీల్లో మరొక కీలకమైన హామీ విశాఖ, విజయవాడలో మెట్రో రైల్. ఇందుకోసం అంచనాలు పంపించాలని తాజాగా కేంద్రమే కోరింది. అమరావతిలో 26వేల కోట్లు, విశాఖలో 17వేల కోట్లు దాదాపు 40 వేల కోట్లతో%ూ% రెండు దశలలో మెట్రో నిర్మాణానికి వారం పది రోజుల్లో అంచనాలను పూర్తి చేసి కేంద్రానికి పంపనుంది రాష్ట్ర సర్కార్. విశాఖ, విజయవాడలో మెట్రోకు ఇప్పటికే డీపీఆర్ కూడా సిద్ధం చేశారు. ఇక కేంద్రం కొత్తగా ప్రకటించిన ఇండస్ట్రియల్ కారిడార్లలో రాష్ట్రం మీదుగా మూడు కారిడార్లు వెళ్లబోతున్నాయి. విశాఖపట్నం-చెన్నై.. హైదరాబాద్- చెన్నై.. హైదరాబాద్ -బెంగళూరు కారిడార్ల వల్ల రాష్ట్రానికి భారీగా ప్రయోజనం కలగనుంది. కర్నూలు జిల్లా ఓర్వకల్, కడప జిల్లా కొప్పర్తిలో దాదాపు 5వేల కోట్ల రూపాయల నిధులతో ఏర్పడబోతున్న ఈ క్లస్టర్ల ద్వారా లక్ష ఇరవై వేల మందికిపైగా ఉపాధి లభించబోతోంది. భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. ఈ నిధులను కూడా వెంటనే ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. రాజధాని సహా.. ఏపీలో మౌలిక సదుపాయాల కల్పనకు 2400 కోట్లు కేంద్రం కేటాయించగా.. ఇప్పటికే 1500 కోట్లు రిలీజ్ చేసింది. 15వ ఆర్థిక సంఘం నిధులు 1450 కోట్లు రావడంతో.. వాటిని అన్ని గ్రామ పంచాయతీలకు పంపిణీ చేస్తోంది ప్రభుత్వం. కేంద్ర నిధుల వరదతో.. క్షణం ఆలస్యం చేయకుండా కార్యాచరణ ప్రారంభించింది ఏపీ ప్రభుత్వం. నాలుగేళ్లు టార్గెట్‌గా పెట్టుకుని దశలవారీగా పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో.. ముందుకెళు_ంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# పాకిస్థాన్‌తో చర్చలు జరిపే అంశంపై జైశంకర్ కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: పాకిస్థాన్‌తో చర్చలు జరిపే అంశంపై విదేశాంగ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఈరోజు నిర్వహించిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాక్‌తో పదే పదే చర్చలు జరిపే కాలం ముగిసిందని ఆయన స్పష్టం చేశారు. పాక్ మనతో ఎలా వ్యవహరిస్తే మనమూ ఆ దేశంతో అలాగే వ్యవహరిస్తామని పేర్కొన్నారు. పాక్‌కు తగిన విధంగా బదులిస్తామన్నారు. పాక్ ఉగ్రవాద చర్యలకు తగిన పర్యవసానాలు ఉంటాయని హెచ్చరించారు. జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370 ముగిసిన కథ అని వ్యాఖ్యానించారు.

జర్మనీలోని దంపతులకు జైశంకర్ హామీ

జర్మనీలో థానేకు చెందిన దంపతులకు చేదు అనుభవం ఎదురైంది. భౌతికంగా హింసించారనే ఆరోపణలతో వీరి కూతురిని జర్మనీ ప్రభుత్వం సంరక్షణ కేంద్రానికి తరలించింది. ఆ చిన్నారి 36 నెలలుగా అక్కడే ఉంటోంది. ఈ విషయాన్ని ఆ తల్లిదండ్రులు స్థానిక ఎంపీ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన కేంద్రమంత్రికి తెలియజేశారు. ఆ చిన్నారిని, తల్లిదండ్రులను సాధ్యమైనంత త్వరగా భారత్‌కు రప్పిస్తామని జైశంకర్ హామీ ఇచ్చారు.

# హైకోర్టులో కేఏ పాల్ పిటిషన్

ఢిల్లీ: ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ మరోసారి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ లో ఆయన కోరారు. ఒక పార్టీ నుంచి గెలిచి... అధికారం కోసం పార్టీ మారడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ తరపున దానం నాగేందర్ ఎమ్మెల్యేగా గెలుపొందారని... ఆరు నెలలు తిరగక ముందే ఇంకొక (కాంగ్రెస్ పార్టీ) తరపున ఎంపీగా పోటీ చేశారని అన్నారు. రాజీనామాలు చేయకుండా పార్టీ మారిన ఫిరాయింపుదారులు అధికారాలు అనుభవిస్తున్నారని చెప్పారు. ఇది ముమ్మాటికీ రాజ్యాంగాన్ని, చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. ఈ పిటిషన్ పై వాదనలు విన్న హైకోర్టు... అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ పార్టీ కూడా ఆగ్రహంగా ఉన్న సంగతి తెలిసిందే. పార్టీని మారిన వారిపై చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి ఛైర్మన్ లను బీఆర్ఎస్ కోరింది.

## అతి త్వరలో టెలిగ్రామ్ యాప్ బ్యాన్?

# నిషేదానికి కారణాలు ఇవే!

ఢిల్లీ : భారత్ లో టెలిగ్రాం యాప్.. అతి త్వరలోనే బ్యాన్ కాబోతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయానికి సంబంధించి, భారత్ కి చెందిన సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ విచారణను కూడా చేపట్టింది. అయితే రెండ్రోజుల క్రితమే టెలిగ్రాం యాప్ సీఈవో 'పావెల్' ను అరెస్ట్ చేయడంతో.. ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ, ఈ టెలిగ్రాం యాప్ ను బ్యాన్ చేయాలనే ఆలోచనలో పడ్డాయి. మరి ఈ యాప్ ను ప్రస్తుతం ఎందుకు బ్యాన్ చేయాలి అనుకుంటున్నారు.? తదితర కారణాలను ఒకసారి చూస్తే..

టెలిగ్రాం నిషేధానికి ప్రధాన కారణాలు ఇవే..

సెన్సార్ లేకుండా విద్వేష ప్రసంగాలు ఉండటం: టెలిగ్రాం లో వచ్చే అనేక రకాల వీడియోలకు సెన్సార్ అనేదే లేదు, తద్వారా నియంత్రణ లేకుండా పోయింది. ఈ యాప్ ను సామాజిక కోణంలో చూస్తే.. యాప్ నిర్వహణ సరిగా లేదు. రెచ్చగొట్టే విధంగా విద్వేష ప్రసంగాలు, దాని వల్ల కలిగే అనర్థాలు, అల్లర్లు వంటి వీడియోలు ఈ యాప్ లో యథావిధిగా రావటం. దీని వల్ల నేరుగా హింసను ప్రేరేపించినట్లు అవుతుంది.టెర్రరిస్టులకు అడ్డాగా మారింది: టెర్రరిస్టులు తమ కార్యకలాపాలు, యాక్షన్ ప్లాన్ లు, కమ్యూనికేషన్స్ మొత్తం ఈ యాప్ ద్వారానే కొనసాగిస్తున్నట్లు విచారణ సంస్థలు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేక టెర్రరిస్టు సంస్థలకు టెలిగ్రాం అడ్డాగా మారింది. అశ్లీలతకు, హనీ ట్రాప్ కు కూడా అడ్డాగా టెలిగ్రాం: ఈ యాప్ లో ఎక్కువగా అశ్లీలత, చైల్డ్ పోర్న్ కంటెంట్ కు సంబంధించిన వీడియోలు ఉన్నట్లు సైబర్ క్రైమ్ సెంటర్ నిర్ధారణకు వచ్చింది. ఇంకా మహిళల అక్రమ రవాణా, హనీ ట్రాప్ కు ఈ యాప్ అడ్డాగా మారింది. ఈ యాప్ లో భారత్ తో పాటు పలు దేశాల చట్టాలకు విరుద్ధంగా కంటెంట్ ఉండటం. అన్ని రకాల పరీక్ష పేపర్ల లీక్: ఇటీవలే భారత్ లో జరిగిన నీట్ ఎగ్జామ్ పేపర్ లీక్ మొత్తం ఈ యాప్ ద్వారానే బయటపడింది.లీక్ అయిన నీట్ పేపర్ ఈ యాప్ ద్వారానే షేర్ చేయబడింది. ఇంకా హర్యానా, బీహార్, రాజస్థాన్, జార?ండ్ రాష్ట్రాలలో నిర్వహించిన ఎగ్జామ్ పేపర్ లీక్ వ్యవహారంలో కూడా టెలిగ్రాం యాప్ కీలకంగా మారినట్లు విచారణ సంస్థ నిర్ధారించింది. సినిమా, ఇతర పైరేటెడ్ కంటెంట్: అన్ని సినిమాలకు సంబంధించిన వీడియోల లింక్స్, నిమిషాల్లోనే ఈ యాప్ లోకి షేర్ చేయబబడేవి. దీంతో పాటు మూజిక్, సాఫ్ట్ వేర్ ఈ-బుక్స్, ప్రభుత్వాలు బ్యాన్ చేసిన వెబ్ లినక్స్ సైతం ఈ యాప్ ద్వారా షేర్ చేయబడేవి. ఇలా.. అనేక రకాల నిషేదిత అంశాలు గల కంటెంట్ ఈ యాప్ లో కొనసాగుతున్నట్లు భారత సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ నిర్ధారించింది. అందువల్లే ఈ యాప్ ను భారత్ తో పాటు ఇతర దేశాలు కూడా బ్యాన్ చేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిన ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ

ఢిల్లీ : మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కూలిన ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ క్షమాపణలు కోరారు. ఈ ఘటనపై తాను శిరస్సు వంచి క్షమాపణ చెబుతున్నానన్నారు. శివాజీ కేవలం మహారాజు మాత్రమే కాదని, ఆయన గౌరవనీయమైన వ్యక్తి అన్నారు. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో వద్వన్ ఓడరేవు,ఇతర ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం ప్రధాని మాట్లాడారు. ఛత్రపతి శివాజీని తమ పూజ్య దైవంగా ఆరాధించే వారందరి మనోభావాలు ఈ విగ్రహం కూలిపోవడం వల్ల దెబ్బతిని ఉంటాయి... అందుకే నేను క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు. "మన సంస్కృతి భిన్నమైనది. మనకు గౌరవనీయ వ్యక్తులు, దైవం కంటే గొప్పది ఏదీ లేదు" అని స్పష్టం చేశారు. గత ఏడాది నేవీ డే (డిసెంబర్ 4) నాడు సింధుదుర్గ్ జిల్లా మల్వాన్ తహసీల్‌లోని రాజ్‌కోట్ కోటలో ప్రధాని మోదీ 35 అడుగుల శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మహారాష్ట్రలో భారీ వర్షాల కారణంగా ఈ విగ్రహం నాలుగు రోజుల క్రితం కుప్పకూలింది. అదే స్థలంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని పునర్నిర్మిస్తామని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ తెలిపారు.

## ఖర్గే గారూ... తెలంగాణ ప్రభుత్వానికీ

# సలహా ఇవ్వండి: కేటీఆర్ సూచన

హైదరాబాద్ : ఖర్గే గారూ... మీరు చెప్పినట్లుగా ఒకరి ఇం టిని కూల్చేసి, వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా చేయ ఎడం అమా నవీయం, అన్యాయం అంటూబీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర ట్వీట్ చేశారు. మహబూబ్ నగర్ పట్టణ సమీపంలో ఇళ్లను కూల్చివేసిన ఘటనపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. గతంలో బుల్డోజర్ పాలనపై ఖర్గే చేసిన ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఒకరి ఇంటిని కూల్చివేసి, వారి కుటుంబాన్ని నిరాశ్రయులను చేయడం అమానవీయం, అన్యాయం" అని ఖర్గే గతంలో ట్వీట్ చేశారు. దీనిని కేటీఆర్ ప్రస్తావించారు. తెలంగాణలోనూ చట్టం, న్యాయవ్యవస్థ పట్ల తీవ్ర ధిక్కారం కనిపిస్తోందని పేర్కొన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలో పేదలకు చెందిన 75 ఇళ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు కోల్పోయిన ఈ నిరుపేదల్లో 25 కుటుంబాలు వికలాంగులవేనని తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను కూడా కేటీఆర్ పోస్ట్ చేశారు. సరైన విధివిధానాలు లేని చట్టం చట్టమే కాదన్నారు. దయచేసి తెలంగాణను ఈ దేశంలో మరో బుల్డోజర్ రాజ్యంగా మారకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇవ్వండని ఖర్గేకు సూచించారు.

## భారత న్యాయ వ్యవస్థపై నాకు అత్యంత గౌరవం ఉంది



హైదరాబాద్ : భారత న్యాయ వ్యవస్థపై తనకు అత్యంత గౌరవం, పూర్తి విశ్వాసం వున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆగస్ట్ 29న కొన్ని పత్రికలు రాసిన కథనాలు... గౌరవనీయ న్యాయస్థానం యొక్క న్యాయపరమైన విజ్ఞతను తాను ప్రశ్నిస్తున్నాననే అభిప్రాయం తనపై కలిగేలా చేసిందనే విషయాన్ని అర్థం చేసుకోగలనని ఆయన చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. న్యాయ వ్యవస్థను తాను ఎంతో విశ్వసిస్తాననే విషయాన్ని మరోసారి గట్టిగా చెపుతున్నానని రేవంత్ అన్నారు. మీడియాలో వచ్చిన కథనాల పట్ల తాను బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. తనకు సంబంధం లేని వ్యాఖ్యలను తనకు ఆపాదించారని విమర్శించారు. న్యాయ వ్యవస్థ, దాని స్వతంత్రత పట్ల తనకు అత్యున్నత గౌరవం ఉందని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని దృఢంగా విశ్వసించే వ్యక్తిగా... న్యాయ వ్యవస్థను ఎప్పటికీ గౌరవిస్తూనే ఉంటానని తెలిపారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో... బీఆర్ఎస్, బీజేపీల ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందంటూ రేవంత్ అన్నట్టు మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలను ఓటుకు నోటు కేసు విచారణ సందర్భంగా బీఆర్ఎస్ నేత తరపు న్యాయవాది ప్రస్తావించగా... సుప్రీంకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఇలాంటి వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని తగ్గిస్తాయని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాజకీయాలతో తమకు సంబంధం లేదని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి న్యాయస్థానాల పట్ల గౌరవంగా ఉండాలని చెప్పింది. న్యాయవ్యవస్థపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో, రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చారు.

# సెప్టెంబరు 1.. 'ఏపీ సీఎం' చరిత్రలో మరుపురాని రోజు



అమరావతి : కాలం అన్నాక ఆగదు.. క్యాలెండర్ లో తేదీలు మారి పోతుంటాయి.. నెలలు గడిచి పోతుంటాయి.. సంవత్సరాలు కరిగిపోతుంటాయి.. తిరిగి వెనక్కు చూసు కోలేనంత వేగంగా కాలం పరిగెడుతుంటుంది.. ఈ క్షణాన్ని.. ఈ రోజును సద్వినియోగం చేసుకున్నవారే చరిత్రలో నిలిచిపోతారు. అలాంటివారే చరిత్రను తిరగరాస్తుంటారు. దీనినే టైమ్ విలువను గుర్తించడం అంటారు. ఇక ప్రతి ఒక్కరికి జీవితంలో మరుపురాని రోజు అంటూ ఉంటుంది. అది పుట్టిన రోజు, పెళ్లి రోజు, ప్రేమకు ఆమోద ముద్ర పడిన రోజు.. వీటిలో ఏదైనా కావొచ్చు. అత్యధిక పరుగుల సచిన్ రికార్డుకు 'రూట్' వేసేస్తున్నాడు నాటి ఏపీ సీఎం.. నేటి ఏపీ సీఎం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. యావత్ దేశంలో ప్రస్తుతం అత్యంత సీనియర్ నాయకుడు ఎవరంటే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడే అని చెప్పాలి. ఈ విషయంలో సీనియర్లు ఒకరిద్దరు పోటీకి ఉన్నా.. చంద్రబాబు స్థాయి వారిది కాదు. ఎందుకంటే.. 46 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితం ఆయనది. 28 ఏళ్లకే ఉమ్మడి ఏపీ వంటి రాష్ట్రానికి మంత్రి అయిన ఘనత. మహా నటుడు ఎన్టీఆర్ కు అల్లుడు అయిన ప్రత్యేకత. ఇక రాజకీయ జీవితానికి వస్తే చంద్రబాబుది చెరగని ముద్ర. ఎందుకంటే.. ఉమ్మడి ఏపీకి సీఎంగా రెండుసార్లు వరుసగా పనిచేసిన ఆయన.. విభజిత ఏపీకి కూడా రెండుసార్లు (విడివిడిగా) సీఎంగా పనిచేసిన నాయకుడిగా నిలిచిపోతారు. దాదాపు 20 ఏళ్లు సీఎం చంద్రబాబు ఉమ్మడి ఏపీకి 1995-2004 మధ్య వరకు సీఎంగా వ్యవహరించారు. అంటే.. దాదాపు 9 సంవత్సరాల 3 నెలలు ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ టర్మ్ లలో రెండుసార్లు ఆయన పూర్తిస్థాయి ఐదేళ్లు సీఎంగా లేకపోవడం గమనార్హం. ఇక 2014-19 మధ్య పూర్తికాలం విభజిత ఏపీకి సీఎంగా వ్యవహరించారు. ప్రస్తుతం రెండోసారి 2024 జూన్ నుంచి సీఎంగా ఉన్నారు. ఈ విడతలో ఐదేళ్లు కలుపుకొంటే ఆయన మొత్తం మీద దాదాపు 20 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నట్లు లెక్క. తెలుగు రాష్ట్రాల్లో ఎవరికీ దక్కని రికార్డుగా దీనిని చెప్పుకోవచ్చు. ఇక ప్రతిపక్ష నేతగానూ చంద్రబాబు దాదాపు ఇంతే కాలం. 1989-94, 2004-14, 2019-24 మధ్యన 20 ఏళ్లకు పైగా ఆయన ప్రతిపక్ష నేతగా లేదా ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుడిగా ఉన్నారు. బహుశా ఇది కూడా రికార్డేనేమో? తొలిసారిగా సెప్టెంబరు 1న చంద్రబాబు జీవితంలో మరుపురాని రోజు అంటే.. సెప్టెంబరు 1 అనే చెప్పాలి. 1995లో ఆయన ఇదే రోజున ఉమ్మడి ఏపీకి సీఎం అయ్యారు. అప్పటి ముఖ్యమంత్రి, తనకు పిల్లనిచ్చిన మామ అయిన ఎన్టీఆర్ తో విభేదించిన చంద్రబాబు మెజారిటీ టీడీపీ ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకొని అధికారం చేపట్టారు. అలా 1995 సెప్టెంబరు 1న ఆయన ఉమ్మడి ఏపీకి తొలిసారి సీఎం అయ్యారు. 1999లోనూ గెలిచారు. అయితే, 2004, 2009లో ఓటమి పాలయ్యారు. విభజిత ఏపీకి 2014లో తొలి సీఎంగానూ ఎన్నికై ప్రత్యేకత చాటుకున్నారు. కాగా, 1995లో చంద్రబాబు తన మామ ఎన్టీఆర్ ను పదవీచ్యుతుడిని చేయడంపై అనేక విమర్శలున్నాయి. ప్రతిపక్షాలు దీనిని వెన్నుపోటు అని అభివర్ణిస్తుంటే.. టీడీపీ మద్దతుదారులు మాత్రం పార్టీని రక్షించుకునేందుకు ఇంతకు మించిన మార్గం లేదని సమర్థిస్తుంటాయి.

# అధికారులకు భారీ సెగ... హైడ్రా మరో సంచలన నిర్ణయం!



హైదరాబాద్ : ఇప్పుడు తెలంగాణలో "హైదరాబాద్ డిజా స్టర్ రెస్పాన్స్ అండ్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్" (హైడ్రా) ఎంత హాట్ టాపిక్ అనేది తెలిసిన విషయమే. ఇప్పటికే పలు సంచలన నిర్ణయాలు.. వ్యూహాత్మకంగా వాటి అమలుతో హైడ్రా సంచలనంగా మారింది. అక్రమ నిర్మాణం అని తేలితే విరుచుకు పడి పోతుంది. ఈ నేపథ్యంలో మరో సంచలన నిర్ణయం తీసుకుంది.అవును.. తెలంగాణలో అత్యంత హాట్ టాపిక్ గా మారిన హైడ్రా.. చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి సింహ స్వప్నంగా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హైడ్రా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా... ఎఫ్.ఎల్.టీ పరిధిలో నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులకు సిద్ధమైంది. ఇందులో భాగంగా... ఇలాంటి అనుమతులు ఇచ్చిన ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సైబరాబాద్ కమిషనర్ కు హైడ్రా సిఫారసు చేసింది. ఇదే సమయంలో హైదరాబాద్ మెట్రో డెవలప్మెంట్ అథారిటీలో అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారుల లిస్ట్ ను ప్రిపేర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి నగరంలో చాలా మంది చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన విషయం ప్రభుత్వాలకు, అధికారులకు తెలియంది కాదనే చెప్పాలి. అయితే ఈ విషయంలో అధికారుల అలసత్వమో.. లేక, మరేదైనా కారణమో కానీ అవిరామంగా అక్రమ నిర్మాణాలు హైదరాబాద్ లో జరిగాయని అంటుంటారు. అంటే.. ఈ పాపంలో అధికారులదీ భాగం ఉందన్నమాట! దీంతో... అక్రమ నిర్మాణాలు చేపట్టినవారే కాదు.. నిబంధనలకు నీళ్లొదిలి వారికి సహకరించిన అధికారులపైనా హైడ్రా దృష్టి సారించింది. ఆయా ప్రాంతాల్లో పనిచేసిన అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వహించడంలో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో.. ఆ అధికారుల లెక్క తేల్చాలని హైడ్రా ఫిక్సయ్యిందని అంటున్నారు. కాగా.. ఇప్పటివరకూ 18 ప్రాంతాల్లో చిన్నా పెద్దా అంతా కలిపి సుమారు 200 కు పైగా నిర్మాణాలను హైడ్రా కూల్చివేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సుమారు 50 ఎకరాల వరకూ చెరువుల భూములను, ప్రభుత్వ భూములను పరిరక్షించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇన్ని అక్రమ నిర్మాణాలను అనుమతులు ఇచ్చిన అధికారులపైనా దృష్టి సారించినట్లు సమాచారం. హైడ్రా పేరుతో అవినీతికి పాల్పడితే... సీఎం వార్నింగ్: మరోపక్క హైడ్రా పేరు చెప్పి కొంతమంది అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని.. గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డుపెట్టుకుని డబ్బులు అడుగుతున్నట్లు తెలిసిందని.. అమాయకులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని.. అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధాన్ని ఆపిన 10నెలల చిన్నారి

ఢిల్లీ : ప్రపంచంలోని శక్తివంత మైన దేశాలన్నీ చేయలేని పని గాజాలో 10 నెలల చిన్నారి చేసింది. దాదాపు 11 నెలలుగా సాగుతున్న యుద్ధాన్ని మూ డు రోజుల పాటు ఆపేసింది. ఆ రెండు దేశాల మధ్య యుద్ధాన్ని ఆపేందుకు అంగీకారం కుదిరింది. హ మాస్, ఇజ్రాయెల్ వేర్వేరు జోన్లలో మూడు రోజుల పాటు కాల్పుల విరమ ణకు అంగీకరించాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. అమెరికాతో పాటు పలు అగ్రరాజ్యాలు ఈ యుద్ధాన్ని ఆపేందుకు నెలల తరబడి ప్రయత్నిస్తుండగా.. 10 నెలల పాప ఈ అద్భుతాన్ని చేసింది. ఆగస్టు 23న.. 25 సంవత్సరాల తర్వాత గాజాలో పోలియో వైరస్‌ని గుర్తించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ధృవీకరించింది. గాజాలో 10 నెలల పాప అబ్దుల్ రెహమాన్ టైప్ 2 పోలియో వైరస్ బారిన పడి వికలాంగులయ్యారు. గాజా యుద్ధంలో పిల్లలకు పోలియో చుక్కలు వేయడం చాలా కష్టంగా మారిందని, దాదాపు 6.5 లక్షల మంది పిల్లలకు తక్షణ పోలియో చుక్కలు వేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.

మూడు జోనల్లో మూడ్రోజుల పాటు కాల్పుల విరమణ

మూడు వేర్వేరు జోన్లలో మూడు రోజుల పాటు కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ సైన్యం, హమాస్ అంగీకరించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ సీనియర్ అధికారి తెలిపారు. గాజా స్ట్రిప్‌లో హమాస్, ఇజ్రాయెల్ మధ్య మూడ్రోజుల కాల్పుల విరమణ సందర్భంగా 6 లక్షల 40 వేల మంది పిల్లలకు టీకా ప్రచారం నిర్వహించనున్నారు. ఆదివారం నుంచి వ్యాక్సినేషన్ ప్రచారాన్ని ప్రారంభించనున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారి రిక్ పెప్పర్‌కార్న్ తెలిపారు. ఇందుకోసం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కాల్పుల విరమణ ఉంటుంది. మూడు రోజుల కాల్పుల విరమణ సమయంలో సెంట్రల్ గాజా నుండి పోలియో వ్యాక్సినేషన్ ప్రచారం ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. దీని తరువాత దక్షిణ గాజా, ఉత్తర గాజాలో పోలియో ప్రచారం నిర్వహించబడుతుంది. అవసరమైతే, నాల్గవ రోజు ప్రతి జోన్‌కు కాల్పుల విరమణ కోసం ఇజ్రాయెల్, హమాస్ మధ్య ఒప్పందం కుదిరిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారి రిక్ పెప్పర్‌కార్న్ చెప్పారు.

కాల్పుల విరమణకు సిద్ధమైన హమాస్-ఇజ్రాయెల్

అయితే ఈ ఆపరేషన్ భద్రత కోసం అంతర్జాతీయ సంస్థతో సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హమాస్ అధికారి బస్సెమ్ నయీమ్ తెలిపారు. దీంతో గాజా స్ట్రిప్‌లో దాదాపు 6.5 లక్షల మంది చిన్నారులకు పోలియో నుంచి రక్షణ లభించనుంది. ఇజ్రాయెల్ ఆర్మీ సమన్వయంతో టీకా ప్రచారం నిర్వహించనున్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ మానవతా విభాగం బుధవారం తెలిపింది. ఈ సాధారణ కాల్పుల విరమణ గాజా జనాభా టీకా ప్రచారం నిర్వహించబడే వైద్య కేంద్రాలకు చేరుకోవడానికి సహాయపడుతుంది.



దాదాపు 11 నెలలుగా గాజాలో యుద్ధం

అక్టోబర్ 7, 2023న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఈ దాడిలో 1,200 మందిని హతమార్చామని, 250 మంది ఇజ్రాయెల్ పౌరులను బందీలుగా పట్టుకున్నామని హమాస్ పేర్కొంది. దీని తరువాత, ఇజ్రాయెల్ హమాస్‌పై పెద్ద ఎత్తున సైనిక చర్యను ప్రారంభించింది. పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం, ఇజ్రాయెల్ దాడులలో సుమారు 40 వేల మంది పాలస్తీనియన్లు మరణించారు. అయితే రెండు రెట్లు ఎక్కువ మంది గాయపడ్డారు. గాజా స్ట్రిప్‌లో కొనసాగుతున్న ఇజ్రాయెల్ ఆర్మీ ఆపరేషన్ కారణంగా గాజాలోని దాదాపు మొత్తం జనాభా (23 లక్షల మంది) నిర్వాసితులయ్యారు.

# ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న రేవంత్ సర్కార్

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అభివృద్ధి కాంక్షను పక్కనబెట్టి, రాజకీయ కక్షతో ముందుకు వెళ్లడం గర్హనీయమని విమర్శించారు. రేవంత్ రెడ్డి దివాళాకోరు రాజకీయాలకు ఇది పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద 33 జిల్లాల్లో మంజూరైన సుమారు రూ.10 వేల కోట్ల విలువ చేసే 34,511 పనులను రద్దు చేయడమే దీనికి నిదర్శనమన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఈ వివరాలను బయటపెట్టిందంటూ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా మంజూరైన అనేక పనులను నిలిపివేయడంతో పాటు, ఇప్పటికే ప్రారంభమైన అనేక పనులను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగించొద్దని మధ్యంతరంగా నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. దాదాపు పూర్తి కావొస్తున్న ప్రాజెక్టులకు సైతం బిల్లుల చెల్లింపులు నిలిపివేసింది. దీంతో రాష్ట్రంలోని దాదాపు ప్రతి గ్రామంలో పంచాయతీరాజ్, మున్సిపల్, రోడ్లు-భవనాలు, నీటిపారుదల తదితర శాఖలపరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ప్రక్రియకు ఆటంకం కలిగింది. దీంతో ఎంతో మంది ఉపాధి కూడా కోల్పోతున్నారు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి నిరోధక అజెండాతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వానికి కొత్త పనులను చేపట్టే శక్తిసామర్థ్యాలు లేవని ఇప్పటికే తేలిపోగా, మంజూరైన పనులను పూర్తి చేసే కనీస నైతిక బాధ్యత కూడా లేదని పనుల రద్దుతో స్పష్టమైంది. కాంగ్రెస్ పాలన ప్రజలకు శాపంగా మారింది. అభివృద్ధి నిరోధకులుగా ముఖ్యమంత్రి వ్యవరిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గాలకు కేటాయించిన ఎస్డీఎఫ్ నిధులను ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసింది. అయితే ఈ నిధుల నుండే మార్చి నెలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు 10 కోట్ల చొప్పున మంజూరు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రమే నిధులు ఇచ్చి తన కురచ బుద్ధిని, పక్షపాత ధోరణిని చూపింది. కాంగ్రెస్ పార్టీ గెలవని నియోజకవర్గాలపై కక్షతో ఒక్క రూపాయి నిధులను కూడా కేటాయించకపోవడం దుర్మార్గం. నిధులు కేటాయించకపోగా పురోగతిలో ఉన్న పపనులకు సైతం నిధులు నిలిపివేయడం మరో దుర్మార్గం. ఇప్పటివరకు రద్దు చేసిన ఎస్డీఎఫ్ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి రాష్ట్రస్థాయిలో ఒక సమీక్ష సమావేశం కూడా నిర్వహించలేదు. జిల్లా కలెక్టర్లు, అధికారులు సైతం రద్దు చేసిన పనులకు సంబంధించి ఎలాంటి సమీక్షా జరపలేదు. కనీసం పురోగతిలో ఉన్న పనుల నివేదికను ప్రభుత్వానికి ఇవ్వడంలో విఫలమయ్యారు. ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ. ఈ ప్రక్రియలో ప్రజల అవసరాలు మారవు. మారేది కేవలం ప్రభుత్వాలు మాత్రమే. గత ప్రభుత్వ ఆనవాలు లేకుండా చేస్తానని కంకణం కట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి తన అనాలోచిత చర్యలతో తన ఆనవాలునే ప్రజల్లో లేకుండా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్వార్థ పూరిత రాజకీయాలు చేయడం పక్కనపెట్టి, రాష్ట్ర అభివృద్ధికి పాటు పడాలి. గత ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ అవి ప్రజల అవసరాల కోసమే కాబట్టి ఆ పనులను పూర్తి చేసేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని, నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.' అంటూ హరీశ్‌రావు ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడటం దుర్మార్గం. అభివృద్ధి కాంక్షను పక్కనబెట్టి, రాజకీయ కక్షతో ముందుకు వెళ్లడం గర్హనీయం. రేవంత్ రెడ్డి దివాళాకోరు రాజకీయాలకు ఇది పరాకాష్ట.

# రాయ్‌బరేలీ, వయనాడ్‌లో పోటీ కోసం రాహుల్‌గాంధీకి రూ. 1.4 కోట్లు ఇచ్చిన పార్టీ



ఢిల్లీ: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడ్, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేసి రెండు చోట్లా విజయం సాధించారు. ఈ ఎన్నికల సందర్భంగా రాహుల్‌కు పార్టీ నుంచి ఎంత మొత్తం అందిందన్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి తెలియజేసింది. ఒక్కో స్థానం కోసం రాహుల్‌కు రూ. 70 లక్షల చొప్పున మొత్తం రూ. 1.4 కోట్లను పార్టీ ఫండ్‌గా ఇచ్చినట్టు తెలిపింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నుంచి బరిలోకి దిగిన బీజేపీ అభ్యర్థి, బాలీవుడ్ నటి కంగన రనౌత్‌పై పోటీ చేసిన విక్రమాదిత్య సింగ్ పార్టీలోనే అత్యధికంగా రూ. 87 లక్షలు అందుకున్నారు. బీజేపీ సిట్టింగ్ ఎంపీ స్మృతి ఇరానీని ఓడించిన కిషోరీలాల్ శర్మ, కేసీ వేణుగోపాల్ (అళప్పుళ, కేరళ), మాణికం ఠాగోర్ (విరుధునగర్, తమిళనాడు), కర్ణాటకలోని గుల్బర్గా నుంచి బరిలోకి దిగిన రాధాకృష్ణ, పంజాబ్‌లోని ఆనంద్‌పూర్ సాహిబ్ నుంచి పోటీ చేసిన విజయ్ ఇందర్ సింగ్లాకు చెరో రూ. 70 లక్షలు అందించింది. కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆనంద శర్మ, దిగ్విజయ్ సింగ్ వరుసగా రూ. 46 లక్షలు, రూ. 50 లక్షలు అందుకున్నారు. రాయ్‌బరేలీ, వయనాడ్ నుంచి విజయం సాధించిన రాహుల్‌గాంధీ వయనాడ్ సీటుకు రాజీనామా చేసి యూపీ స్థానాన్ని అట్టేపెట్టుకున్నారు. కాగా, ఎన్నికల సంఘం 2022లో చేసిన ప్రతిపాదన మేరకు ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల ఖర్చును రూ. 70 లక్షల నుంచి రూ. 95 లక్షలకు, అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి ఖర్చును రూ. 28 లక్షల నుంచి రూ. 40 లక్షలకు పెంచింది.

# గర్ల్స్ హాస్టల్‌లో సీక్రెట్ కెమెరాల ఉదంతంపై ఏపీ ప్రభుత్వం సీరియస్..

అమరావతి: కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో రహస్య కెమెరాలు ఉన్నాయని విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఉద్రికత్తకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు విచారణకు ఆదేశించారు. హాస్టల్‌లో రహస్య కెమెరాలు ఉన్నాయనే విద్యార్థినుల ఆందోళనపై విచారణ జరపాలని ఆదేశించారు. తక్షణమే జిల్లా మంత్రి కొల్లు రవీంద్రతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఘటనాస్థలికి వెళ్లాలని ఆదేశించారు. ఈ క్రమంలో దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి విద్యార్థుల స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఓ యవతి సహకారంతో వాష్‌రూమ్‌లో సీక్రెట్ కెమెరాలు పెట్టారని విద్యార్థులు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ గంగాధర్ మీడియాతో మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కాలేజీలో ఘటన దురదృష్టకరమని అన్నారు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతుందని తెలిపారు. అనుమానితుడి నుంచి ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నేరానికి పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కఠిన చర్యలు తప్పవు : హోంమంత్రి అనిత

గుడ్లవల్లేరు కాలేజీ ఘటనపై హోంమంత్రి అనిత తీవ్రంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దోషులు, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వేధింపులు లేకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలి : నారా లోకేశ్

ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినుల ఆందోళనపై ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హిడెన్ కెమెరాల ఆరోపణలపై విచారణకు ఆదేశించారు. విచారణలో తప్పు చేశారని తేలితే దోషులు, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలేజీల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తచర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. కాలేజీలో ర్యాగింగ్, వేధింపులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు.

# పోలింగ్ బూత్ సంఖ్య ను పెంచండి

-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కీసర మోహన్ రెడ్డి, భరత్ పరిమి ఆధ్వర్యంలో.




కల్లూరు – ప్రభాత సూర్యుడు : కల్లూరు మండల పరిధిలో గల పేరువంచ గ్రామ పంచాయితీ లో సుమారు 2500 ఓటింగ్ కలిగిన పంచాయితీలలో పేరువంచ పంచాయితీ ఒకటి. ఇలాంటి అతి పెద్ద పంచాయితీ లో ఎలక్షన్ సమయం లో ఓటర్ల సంఖ్య 1250 చొప్పున ఎలక్షన్ బూత్ లు రెండు మాత్రమే కేటాయించారు ఒక్కో బూత్ లో 1250 మంది ఓటర్లు స్త్రీ మరియు పురుషులు లైన్ లో నిలబడి ఓటు హక్కు వినియోగించు కునే సమయానికి ఓటర్ లు తీవ్ర ఇబ్బందులు గురి అవుతున్నారు కొందరూ ఓటింగ్ కి దూరం అవుతున్నారు ఈ విధంగా ఓటింగ్ శాతం తక్కువ అవుతుంది సంబందించిన ఎలక్షన్ అధికారులు ద్రుష్టికి మరియు జిల్లా కలెక్టర్ ద్రుష్టి కి ఈ ఓటర్ల ఇబ్బందులు అధికారులు ద్రుష్టి కి తీసుకెళ్లి మండల పరిధిలో ఉన్న పెద్ద పంచాయితీ లలో మరియు పేరువంచ పంచాయితీ లో ఎన్నికల బూత్ ల సంఖ్య పెంచాలి అని తహసీల్దార్ కార్యలయం లో డిప్యూటీ తహసీల్దార్ కి పేరువంచ ఓటర్ల ఇక్కట్లు విష్యాన్ని వివరిస్తూ దరఖాస్తు ని అంద చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో పేరువంచ గ్రామ పంచాయితీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కీసర మోహన్ రెడ్డి మరియు యువజన కాంగ్రెస్ నాయకులు పరిమి భరత్,యన్. యస్. యూ. ఐ నాయకులు కొండపల్లి మురళి, ఉబ్బన అశోక్, షైక్ సైదులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు

## శనివారం డయల్ యువర్ డి ఎం ప్రోగ్రాం.....



సత్తుపల్లి ప్రభాత సూర్యుడు :- శనివారం సాయంత్రం మూడు గంటల నుండి నాలుగు గంటల వరకు డయల్ యువర్ డిఎం ప్రోగ్రాం లో ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేయాలని సత్తుపల్లి డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం మూడు గంటల నుండి నాలుగు గంటల వరకు 9959225962 కు ఫోన్ చేసి మీ సమస్యలను వివరించాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. సత్తుపల్లి డిపో పరిధిలో ఉన్న ప్రయాణికులు ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల...





ఖమ్మం బ్యూరో ప్రభాత సూర్యుడు :- ఖమ్మం పట్టణంలో 18వ డివిజన్లో 135 లక్షల వ్యయంతో వాటర్ డ్రైన్ నిర్మాణానికి శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం పట్నాన్ని, నియోజవర్గంలో మిగిలిన అన్ని పనులు పూర్తి చేస్తామని అలాగే రాష్ట్రంలో కూడా అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేషన్ అధికారులు వివిధ శాఖ చెందిన అధికారులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరు కాలేజ్ ఘటన.. కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడిన ముఖ్యమంత్రి

**అమరావతి,:** కృష్ణా జిల్లా గడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్‌లో రహస్య కెమెరాలు పెట్టారనే అంశంపై జరుగుతున్న విచారణను సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఉదయం ఘటన విషయం తెలిసిన వెంటనే జిల్లా అధికారులను, మంత్రి కొల్లు రవీంద్రను, జిల్లా ఎమ్మెల్యేలను కళాశాలకు వెళ్లాలని ఆదేశించిన ముఖ్యమంత్రి.. ఉదయం నుంచి అక్కడ జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. కలెక్టర్, ఎస్పీలతో ఫోన్ లో మాట్లాడి విచారణ సాగుతున్న విధానంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆందోళనను, ఆవేదనను పరిగణలోకి తీసుకుని పటిష్ట దర్యాప్తు జరపాలని ఆదేశించారు. రహస్య కెమెరాల ద్వారా వీడియోల చిత్రీకరణ జరిగిందన్న విషయంలో నేరం రుజువైతే కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మన ఇంట్లో ఆడబిడ్డలకు కష్టం వస్తే ఎలా స్పందిస్తామో అంతే సీరియస్‌గా స్పందించి నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. ఆందోళనలో ఉన్న వారికి ఒక భరోసా కల్పించాలని సీఎం ఆదేశించారు. విద్యార్థుల ఫిర్యాదును యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణపైనా విచారణ జరపాలన్నారు. కాలేజ్ యాజమాన్యం, అధికారుల అలసత్వం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థినుల వద్ద ఆధారాలు ఉంటే నేరుగా తనకే పంపాలని ఆయన కోరారు. స్టూడెంట్స్ ఎవరూ అధైర్య పడవద్దని, తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఆడబిడ్డల పట్ల తప్పుగా ప్రవర్తించారని తేలితే కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి మూడు గంటలకు ఒక సారి తనకు ఘటనపై రిపోర్ట్ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. వ్యవహారంపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని సూచించారు.

# విద్యావిధానం ఇలా ఉంటే..




ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే ఉన్నత చదువులు చదువుకున్న నేను గత రెండు దశాబ్దాలుగా వివిధ ప్రయివేటు విద్యాసంస్థల్లో గణిత ఉపాధ్యాయుడిగా, భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా, అప్పుల తాకిడితో విపరీతమైన ఆర్థిక సమస్యలను చూసిన విద్యాసంస్థల నిర్వాహకుల్లో ఒకడిగా ఉంటున్నాను. అన్నింటికీ మించి విద్యారంగ ప్రేమికుడిగా నాకు విద్యతో విడదీయరాని సంబంధం, విడదీయలేని అనుబంధం వుంది. పాఠాలు బోధించిన అనుభవంతో నేటి విద్యావ్యవస్థలోని మార్పులపై నేను కొన్ని నా ఆలోచనలను బాధ్యతతో మీకు విన్నవిస్తున్నాను.

### ప్రవేశ పరీక్షలకు అనుగుణంగా..

ఈ రోజు విద్య కొంతమంది స్వార్థం, కొన్ని రాజకీయ కారణాల వల్ల వ్యాపారంగా తన రూపు మార్చుకోవడం ప్రారంభమైంది. ఐఐటీ, నీట్ వంటివి అసామాన్యమైన ప్రతిభ గల గ్రామీణ, తాలుకా స్థాయి పేద విద్యార్థులకు సైతం అందని ద్రాక్ష అయ్యింది. అందుకే పేద ధనిక సామాజిక సాంస్కృతిక సాంఘిక లింగ కుల మతం వంటి తదితర అంతరాలు లేకుండా అందరికీ సమానంగా "అంతర్జాతీయ స్థాయి విద్య"అందాలి. చదువు "కొనడం" పూర్తిగా మాయమై చదువుకునే అవకాశాలు గల్లీ నుంచి ఢిల్లీ దాకా అందరికీ సమానంగా ఉండాలి. అంతరిక్ష ప్రయోగాల కాలంలో మనం రాణించాలంటే మీరన్నట్లు ప్రపంచంతో పోటీపడాల్సిందే. ప్రైమరీ, హైస్కూల్, ఇంటర్ స్థాయి సిలబస్‌లు ఒకదానికొకటి సంబంధం ఉండాలి. సబ్జెక్ట్ నిపుణుల సాయంతో రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల కనుగుణంగా నూతన సిలబస్, బోధనా పద్ధతులను రూపొందించాలి. మనం అక్కడక్కడ వెలుగులోకి వస్తున్న ఫేక్ సర్టిఫికెట్‌లు కొనుక్కునే స్థాయి కాకుండా వంద ఏళ్ల చరిత్ర కలిగిన మన విశ్వ విద్యాలయాల్లో పి.హెచ్ డి, ఎం.ఎస్సీ, బి.ఎడ్ వంటి తదితర చదువులు చదివి నెట్, సెట్, టెట్ వంటి అర్హత పరీక్షల్లో పాసై, విద్యారంగం, బోధనపై ఆసక్తి వుండి కొన్ని కారణాల వల్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉద్యోగం పొందని వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి విద్యాసంస్థలు నెలకొల్పేలా ప్రోత్సహించాలి.

### వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే..

కేజీ నుంచి పీజీ వరకు బోధన, బోధనేతర ఖాళీలను ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ సాయంతో భర్తీ చేయాలి. బడ్జెట్‌లో విద్యకు 15% నిధులు కేటాయించాలి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కూడా సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేస్తూ ఐఐటీ నీట్ ఫౌండేషన్ విద్యను కూడా ఒత్తిడి లేకుండా అందించగలిగితే విద్యను వ్యాపారం చేస్తున్న వ్యవస్థలను మనం నిర్మూలించవచ్చు. ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయ, అధ్యాపక పిల్లలు ప్రభుత్వ స్కూల్లో, కళాశాలల్లో చదివిస్తే ఆ తల్లిదండ్రులను గుర్తించి, వారి గురించి ఆదర్శప్రాయంగా మీడియాలో రాస్తున్నారంటే మన ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యావ్యవస్థపై లోతుగా విశ్లేషించాల్సిన అవసరం వుంది. ఆర్థికంగా లేని వాళ్లే ప్రభుత్వ బడిబాట అనే విధానంలో కచ్చితంగా మార్పు రావాలి. విద్య మనందరి ప్రాథమిక హక్కు.

### సివిల్స్ అభ్యర్థుల వలె..

శారీరక, మానసిక దృఢత్వం కోసం ఆటలకు ప్రత్యేక సమయం కేటాయించాలి. మీరు తెలంగాణ క్రీడాకారులను ఒలింపిక్స్ పథకాలు తెచ్చేలా ప్రోత్సాహం అందిస్తామన్న తీరును స్వాగతిస్తున్నాం. దానికి పాఠశాలలే పునాది కావాలి. సివిల్స్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు మీరు అందించిన ఆర్థికసాయం అభినందించదగినది. దానివల్ల భవిష్యత్‌లో మన రాష్ట్రం నుంచి సివిల్స్‌కు పోటీపడే అభ్యర్థుల సంఖ్య పెరుగుతుంది. విశ్వవిద్యాలయాల స్థాయిలో పరిశోధనలు పెరిగేలా రిసెర్చ్ స్కాలర్స్‌కు కూడా స్కాలర్‌షిప్ అందించాలి. రసాయనాల కోసం ఆర్థిక సాయం అందించాలి. ఇంజనీరింగ్, మెడికల్ విద్యా వ్యవస్థలో నూతనత్వం కోసం నిపుణుల సలహాలు తీసుకోవాలి. మన పిల్లలకు నాణ్యతతో కూడిన, ఆందోళన లేని పరిసరాలతో స్నేహం చేసే శాస్త్రీయ విద్యను మనం అందించాలి. వివిధ రంగాల ప్రజల నుంచి, వివిధ రకాల విద్యాసదస్సులు, చర్చల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి విభిన్న ఆలోచనల సారాంశాన్ని సేకరించి ఓ మంచి విద్యావిధానంతో మన పిల్లలకు గొప్ప గొప్ప కలల భవిష్యత్తును నిజం చేయాలి.

# విద్యాకల్పనలో ఈ వివక్ష ఏంటి



ఆధునిక యుగారంభంలో యూరప్‌లో వచ్చిన పారిశ్రామిక విప్లవ ఫలితాలతో మిగులు ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఆసియా, ఆఫ్రికా దేశాలకు వచ్చిన యూరోపియన్లు, మనదేశంలో కూడా వలస రాజ్యాలు స్థాపించుకొని వ్యాపార, రాజ్యపాలనతో పాటు ఆంగ్ల విద్యను పరిచయం చేసినా, ఆంగ్లేయులు ఎక్కడ కూడా విద్యా సౌకర్య సదుపాయాలలో ఎలాంటి కుల, మత వివక్ష చూపలేదు. కానీ 1990 దశకంలో ఆంక్షలు లేని ప్రపంచ వాణిజ్యాన్ని ఏర్పర్చాలనే తలంపుతో తెచ్చిన డంకెల్ ప్రతిపాదనలను 1994లో మనదేశం అంగీకరించడంతో ప్రపంచవ్యాప్తంగా సరళీకృత ఆర్థిక విధానాలతో పాటు స్వేచ్ఛ, వ్యాపార, వాణిజ్య విధానాలు ఏర్పడి ఉత్పత్తి రంగంతో పాటు విద్య కూడా లాభాలను ఆర్జించే ఒక వ్యాపార సరుకుగా మారడం ఆరంభమైంది. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్న ఆధునిక ఉత్పత్తి, వ్యాపార, వాణిజ్య, సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి విద్యారంగంలో ప్రవేటు విద్యాసంస్థల ప్రవేశం వేగవంతం కావడంతో ప్రభుత్వ పాఠశాలలు తీవ్రమైన పోటీని ఎదుర్కోవడం, సరిగ్గా ఇక్కడే కామన్ స్కూల్ విధానం పటిష్టం చేయాల్సిన సందర్భంలో కులాల పేరుతో ప్రత్యేక గురు'కుల' పాఠశాలల ఏర్పాటుకు పూనుకున్నారు. ఇవి మొదట్లో మంచి ఫలితాలను ఇచ్చినప్పటికీ రాను రాను ఇవే ఒక ఆధునిక 'విద్యా వివక్ష' ప్రతిరూప కేంద్రాలుగా రూపాంతరం చెందడం ఆక్షేపణీయం.

### సౌకర్యాల లేమిలో కూడా..

రాష్ట్రంలో వివిధ యాజమాన్యాల అధ్వర్యంలో కులం, మతం ఆధారంగా దాదాపు వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలను ప్రభుత్వం నిర్వహిస్తున్నది. పేద పిల్లలకు ప్రత్యేక అవకాశాలు కల్పించడాన్ని ఎవరు కాదనరు.. కానీ కులం, మతం ఆధారంగా సౌకర్యాలు కల్పించడం ఏ మేరకు సమానత్వం సాధించడానికి దోహదం చేస్తుందనేదే ప్రశ్న. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలపై, గురుకులాల్లో చదివే పిల్లలపై వెచ్చిస్తున్న ఖర్చులో భారీ వ్యత్యాసం ఉన్నది. పెరిగిన ధరల అధారంగా గురుకులాల్లో చదివే విద్యార్థిపై సంవత్సరానికి లక్ష అరవై వేల రూపాయలు ఖర్చుచేస్తుండగా, సాధారణ పాఠశాలల్లో చదివే విద్యార్థిపై కేవలం యాభై వేలు మాత్రమే ఖర్చుచేస్తున్నారు. ఇక్కడ విశేషమేమిటంటే గురుకులాల్లో చదివే పిల్లల కంటే, సాధారణ పాఠశాలల్లో చదివే పిల్లల కుటుంబాలు మరింత వెనుకబడిన నిరక్షరాస్యతా కుటుంబాలే అనేవి అంగీకరించాలి. సకల సౌకర్యాలు ఒక వైపుంటే సౌకర్యాల లేమిలో కూడా వారు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. కొన్ని పాఠశాలలు 10/10 జీపీఏతో పాటు 100 శాతం ఉత్తీర్ణతతో గురుకుల పాఠశాల విద్యార్థులకు ఏమాత్రం తీసిపోవడం లేదు. ఇలాంటి పాఠశాలల విద్యార్థులకు గత నెల రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్మానం చేయడం ఎంతో అభినందనీయం.

### గురుకుల విద్యార్థులతో పోల్చితే..

కాంగ్రెస్ ప్రభుత్వం మొన్నటి అసెంబ్లీలో ప్రకటించిన ప్రకారం, గడచినా మూడేళ్లలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు (4,41,559) గణనీయంగా పడిపోయి ప్రవేటు బడుల్లో దాదాపు ఏడు లక్షల నమోదు పెరిగిందని ప్రకటించింది. ఇది ప్రభుత్వ విద్యపై ప్రమాద ఘంటికలను సూచిస్తున్నది. మరొకవైపు ప్రచారంలో ఎంత కృత్రిమ డిమాండ్ సృష్టించినా, వివిధ సంక్షేమ గురుకులాల్లో 2023-24 విద్యా సంవత్సరంలో 1,34,174 ఖాళీలు మిగిలిపోయినవి. వీరిపై చేస్తున్న ఖర్చు మిగిల్చే అవకాశం లేకపోవడంతో ప్రయోజనం లేకుండానే 2,147 కోట్ల వ్యయం వృధా అయినట్టయింది. విద్యా సౌకర్యాలలో అధునాతన భవనాలు ఒకవైపు, మరుగుదొడ్లకు వెతికే స్థితి మరోవైపు, మూడు పూటల పౌష్టికాహారం ఒకవైపు ఒకపూట భోజనం మరోవైపు,కాస్మోటిక్ చార్జీలు, బూట్లు, టై బ్యాగులు ఒకవైపు, తలనూనె లేని చింపిరిజుట్టు, తెగిపోయిన స్లిప్పర్లు, చినిగిపోయిన బ్యాగులు మరోవైపు, ఇరవైనాలుగు గంటలూ ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఒకవైపు, ఎనిమిది గంటల పాఠశాలలు మరోవైపు.. ఇలా సాధారణ పాఠశాలల్లో చదివే విద్యార్థులను, గురుకులాల్లో చదివే విద్యార్థులతో పోల్చితే అధికారిక వివక్షకు గురికాబడుతున్నారు.

### కులవివక్ష కనుమరుగవుతున్న సమయంలో..

కులవివక్ష భౌతికంగా అమలవుతున్నప్పుడు కూడా ఆంగ్లేయుల పాలనా కాలంలో విద్యా సౌకర్యాలలో వివక్షలేదు. అలాంటిది ఆధునిక కాలంలో కుల వివక్ష భౌతికంగా కనుమరుగు అవుతున్నపుడు విద్యాసౌకర్యాల కల్పనలో అధికారిక వివక్షను వికసింపచేసి, స్థిరపరచడం సమాజానికి ఆమోదయోగ్య పరిణామం కాదు. రాజ్యాంగంలోని అర్టికల్ 45 ప్రకారం కనీసం పదవతరగతి వరకు నిర్బంధ ఉచిత, అంతరాలులేని ఆధునిక విద్యను కులమతాలకు అతీతంగా అందరికి సమానంగా అందించడం ప్రభుత్వ విధిగా ఉండాలి. అప్పుడే సమాజంలో అంతరాలు కుదించబడి నవసమాజం వికసితమౌతుంది. ప్రభుత్వ చల్లని దీవెనలకు ఆతృత పడే వారి సలహాలతో పాటు ముంచుకొచ్చే ముప్పును ముందుగానే హెచ్చరించే వారి సూచనలను ముందుగా పరిగణలోకి తీసుకుని విద్యా ప్రణాళికలు తయారుచేసి అమలు చేసినపుడే వివక్ష లేని ఆధునిక సమాజ నిర్మాణం కోసం చేసిన విద్యావ్యయ ఫలితాలు ఫలప్రదమౌతాయి.

# బంగ్లా జమాతేపై నిషేధం రద్దు!



మతోన్మాద జమాత్-ఎ-ఇస్లామీ పార్టీపై ఉన్న నిషేధాన్ని బుధవారం నాడు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసింది. ఆ పార్టీ, దాని అనుబంధ విద్యార్థి విభాగానికి చెందినవారు ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నారంటూ ఆగస్టు ఒకటవ తేదీన నాటి అవామీలీగ్ ప్రభుత్వం నిషేధం విధించింది. తరువాత నాలుగు రోజులకే హసీనా ప్రభుత్వ పతనం, ఆమెను బలవంతంగా మిలిటరీ అధికారులు మనదేశానికి పంపటం తెలిసిందే. తమ దర్యాప్తులో అలాంటి రుజువులేమీ లేవని తేలినందున నిషేధాన్ని ఎత్తివేసినట్లు యూనస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పరిణామం తరువాత తమ పార్టీ నమోదును రద్దు చేస్తూ గతంలో ఒక హైకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి పునరుద్దరించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేయ నున్నట్లు జమాయతే ప్రకటిం చింది. బంగ్లాదేశ్లో జమాతే ఇస్లామీ ఒక వివాదాస్పద సంస్థ. బ్రిటీష్ ఇండియాలో 1941లో ఏర్పడిన ఈ సంస్థ బంగ్లాదేశ్ విముక్తి పోరాటాన్ని వ్యతిరేకించటమే గాక పాకిస్తాన్తోనే కలసి ఉండాలనే వైఖరి తీసుకుంది. విముక్తి కోసం పోరాడినవారి మీద దాడులు, హత్యలకు పాల్పడింది. దాంతో ముజిబుర్ రహమాన్ ప్రభుత్వం 1972లో దాన్ని నిషేధించింది. ముజిబుర్ హత్య తరువాత అధికారానికి వచ్చిన జియావుర్ రహమాన్ ప్రభుత్వం దాన్ని ఎత్తివేసింది.జమాయతే పార్టీ కార్యకలాపాలు లౌకిక వ్యవస్థ, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నందున దాని రిజిస్ట్రేషన్ను రద్దు చేయాలని కోరుతూ 2009లో దాఖలైన పిటీషన్పై 2013లో హైకోర్టు విచారించి ఆమోదించింది. అప్పటినుంచి అది ఎన్నికల్లో నేరుగా పాల్గొనటం లేదు. బంగ్లాదేశ్ నేషనలిస్టు(బిఎన్పి), ఇతర పార్టీల కూటమిలో భాగస్వామిగా ఉంటూ అవామీలీగ్ను వ్యతిరేకిస్తున్నది. అయితే అవామీలీగ్ అణచివేత చర్యల కారణంగా జమాయతేతో చేతులు కలిపినప్పటికీ దానితో సంబంధాలను వ్యతిరేకించే శక్తులు కూడా బిఎన్పిలో ఉన్నాయి.గతేడాది కూడా సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసినప్పటికీ దాని ప్రతినిధులు కోర్టుకు రాని కారణంగా కొట్టివే శారు. ఇప్పుడు రిజిస్ట్రేష న్ను పునరుద్దరించేందుకే అవకాశాలున్నాయి. ఒక వేళ అదే జరిగితే జమాతే వచ్చే ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీకి దిగటం ఖాయం. షేక్ హసీనా ప్రభుత్వానికి, ఆమె పార్టీకి మద్దతిచ్చిన కారణంగా ఆమె పతనం తరువాత బంగ్లాదేశ్లో భారత వ్యతిరేకత పెద్దఎత్తున ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. హసీనా దౌత్య వీసాను ప్రభుత్వం రద్దు చేసింది.హత్యతో సహా అనేక కేసులను నమోదు చేసింది. దీంతో ఆమెను తమదేశానికి అప్పగించాలన్న డిమాండ్ను అక్కడి అవామీలీగ్ వ్యతిరేక పార్టీలు పదేపదే డిమాండ్ చేస్తున్నాయి. ఆమె గురించి నరేంద్రమోడీ సర్కార్ మౌనంగా ఉండటంతో సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు. అవామీలీగ్ ఇతర పార్టీనేతల మీద కూడా కేసులు నమోదు చేయటమేగాక ఇప్పటివరకు ఇద్దరు మాజీ మంత్రులను అరెస్టు చేశారు. బంగ్లాదేశ్-మనదేశం మధ్య 54వరకు చిన్నా పెద్ద నదులు ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బంగ్లాదేశ్లో అనేక చోట్ల వరదలు వచ్చాయి.పది లక్షల మంది పౌరులు ప్రభావితమయ్యారు. దీని వెనుక భారతహస్తం ఉందని, అక్కడి రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసిన కారణంగానే ఇదంతా జరిగిందనే ప్రచారం జరుగుతోంది. త్రిపురలోని గోమతి నది మీద ఉన్న డంబూర్ డామ్ నిండిపోయిన కారణంగా నీటిని దిగువన ఉన్న బంగ్లాదేశ్వైపు విడుదల చేయటం మినహా మరొకమార్గం లేదు. అదే జరిగింది, దాన్ని కావాలనే విడుదల చేసినట్లు మనదేశం మీద వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారు. అక్కడి మన వీసా జారీ కార్యాలయాల్లో తమ పౌరులకు వీసాల జారీని కావాలనే జాప్యం చేస్తున్నారంటూ అనేక మంది నిరసన ప్రదర్శనలకు దిగారు.హసీనా ప్రభుత్వ పతనం తరువాత మనదేశం సిబ్బందిని తగ్గించిన కారణంగా ఆలస్యం జరుగుతున్నది. ఈ పరిస్థితిని కూడా మనదేశం మీద వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకకు కొన్ని శక్తులు చూస్తున్నాయి. బంగ్లాదేశ్ యువతలో ఉన్న ఆగ్రహానికి దేశ ఆర్థిక పరిస్థితి కూడా ఒక కారణం.విదేశీ చెల్లింపుల సమస్యలతో పాటు ఇటీవల వచ్చిన వరదలు కూడా గోరుచుట్టు మీద రోకటిపోటులా మారాయి. ఆగస్టు 21వ తేదీ నాటికి విదేశీ మారకద్రవ్య నిల్వలు 20బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. మొత్తంగా మరో 11బిలియన్ డాలర్లు అవసరం కాగా డిసెంబరు నాటికి కనీసం 8బిలియన్ డాలర్లు అవసరమని అంచనా వేసి ఐఎంఎఫ్తో సహా వివిధ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు.అక్కడి జనం షేకహేసీనా గద్దె దిగాలని మాత్రమే కాదు, తమ పరిస్థితి మెరుగుపడాలని కూడా కోరు కుంటున్నారు. అది జరగకపోతే మరోసారి ఆందోళన మరోరూపంలో జరగటం ఖాయం.

# గెలుపు అంటే ఎంపీలు, ఎమ్మెల్యేలు గెలవడమే కాదు



**హైదరాబాద్, :** గెలుపు అంటే ఎంపీలు, ఎమ్మెల్యేలు గెలవడమే కాదని, ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ నుంచి ఇద్దరు ఎంపీలు ఉన్నప్పుడు అందులో ఒకరు తెలంగాణ నుంచి గెలిచారు. మరొకరు గుజరాత్ నుంచి గెలిచారని, గుజరాత్ లో పార్టీ అధికారంలోకి వచ్చింది.. తెలంగాణలో ఎందుకు అధికారంలోకి రాలేకపోతున్నామన్నారు ఈటల రాజేందర్. 46 ఏళ్ల తర్వాత తెలంగాణలో 8 పార్లమెంట్ స్థానాలు గెలిచామని, లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి ఓటు షేర్ తేడా కేవలం 4 శాతం మాత్రమే అని ఆయన వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీ ఎన్నికల్లో పెట్టిన ఎఫర్ట్ పెట్టాలని, అన్ని లోకల్ బాడీ ఎన్నికల ప్రాధాన్యత గుర్తించాలన్నారు. కేసీఆర్ ఛీ అనిపించుకోవడానికి ఆరేళ్ళు పట్టింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో ఛీ కొట్టించుకోవడానికి 9 నెలలు కూడా పట్టలేదని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తెలంగాణా ప్రజల విశ్వాసం కోల్పోయాయని ఆయన వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి తొలి ముఖ్యమంత్రి అయినట్లు మాట్లాడుతున్నారని, తాత్కాలికంగా విజయం సాధించవచ్చున్నారు ఈటల రాజేందర్. అంతేకాకుండా..'సోషల్ మీడియాలో ట్రెండింగ్ చేస్తున్న వారికి ఎన్ కన్వెన్షన్ మాత్రమే మీకు కనిపిస్తుంది. హస్మత్ చెరువు కింద 120 మంది పేదలకు నోటీసులు ఇచ్చారు. ఫిరంగి నాల ముసుకుపోయింది. చెరువుల్లో ఉన్న భూములన్నీ ప్రభుత్వ భూములు కావు. పేదల ఇండ్లు కులగొట్టడం మీ తరం కాదు. పేదల జోలికి వస్తే ఖబడ్దార్. ప్రత్యామ్నాయంగా ఇండ్లు కట్టించు ఇచ్చి మాట్లాడాలి. రేవంత్ రెడ్డి ప్రజాక్షేత్రంలో తేలిపోవడం ఖాయం. రేవంత్ రెడ్డి చిట్టా రాస్తున్నాం.. సందర్భం వచ్చినప్పుడు బయటకు తీస్తాం. తెలంగాణ వాళ్లకు పాలించడం చేతకాదని హేళన చేసేవాళ్ళు.. రేవంత్ రెడ్డిని చూస్తే అదే నిజం అనిపిస్తుంది. రేవంత్ రెడ్డి కి న్యాయ స్థానాలను గౌరవించడం కూడా తెలియదు. సుప్రీం కోర్టు తీర్పు పై సిఎం హెూదాలో మాట్లాడటం బాధాకరం.' అని ఈటల రాజేందర్ అన్నారు.

## బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం..

# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు



పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడింది. రేపటికి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాలు, దక్షిణ ఒడిశాతో పాటు తెలంగాణ ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు ఒకటి రెండు చోట్ల అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. తీరం వెంబడి బలమైన గాలులు వీయనున్నాయి. సముద్రంలో భారీగా అలలు వస్తాయని, మత్స్యకారుల వేటపై నిషేధం విధించారు. ఎవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురవనున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు అక్కడక్కడ ఒక మోస్తారు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. అల్పపీడనం కారణంగా తెలంగాణ రాష్ట్రానికి వర్ష సూచన ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నేటి నాలుగు రోజులపాటు రాష్ట్రానికి భారీ నుంచి అతి భారీ వర్ష సూచన ఉన్నట్లు పేర్కొంది. నేడు తేలికపాటి నుంచి మోస్తరు.. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. రేపు భారీ వర్షాలు కురిసే సూచన ఉండటంతో రాష్ట్రానికి ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. రేపు రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో నేడు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ చెప్పింది.

# 2026 మార్చిలో దేవాదుల ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తాం..




ములుగు జిల్లా దేవాదుల ప్రాజెక్టును మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 2026 మార్చిలో దేవాదుల ప్రాజెక్టును ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. సోనియా గాంధీ చేతులమీదుగా ప్రారంభోత్సవం చేస్తామని ఆయన వెల్లడించారు. ఇరిగేషన్ శాఖను అడ్డుపెట్టుకొని దోపిడీకి కేసీఆర్ పాల్పడ్డారని, ప్రతీ ప్రాజెక్టులో వేల కోట్ల స్కాం జరిగిందని ఆయన ఆరోపించారు. 1.81 లక్షల నిధులు కేసీఆర్ హాయంలో ఖర్చుపెట్టారని, 14వేల కోట్ల బిల్లులు పెండింగ్ లో ఉంచారన్నారు. కమిషన్ల కక్కుర్తి కొరకు ప్రాజెక్టులు కట్టారని, కాళేశ్వరం, పాలమూరు, దేవాదుల, సీతారామ అన్నిట్లో దోచుకున్నారని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ గ్రామీణ ముఖ చిత్రం మార్చడం మా లక్ష్యమని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతీ ఎకరాకు నీళ్ళు అందిస్తామని, కాళేశ్వరం ప్రాజెక్టును నాశనం చేసారని ఆయన మండిపడ్డారు. నిర్దేశిత గడువులోపు దేవాదుల పూర్తి చేసి, 5.57 లక్షల ఎకరాలకు నీళ్ళు అందిస్తామని, సమ్మక్క బ్యారేజ్ కట్టడం వల్ల దేవాదుల ద్వారా 300 రోజులు, 60 టిఎంసిల నీళ్ళు లిఫ్ట్ చేస్తామన్నారు మంత్రి ఉత్తమ్. అంతేకాకుండా..'ఉమ్మడి వరంగల్ జిల్లాను సస్యశ్యామలం చేస్తాం. ఇరిగేషన్ ప్రాజెక్టులపై కేసీఆర్ కు అవగాహన లేకుండా తీరని అన్యాయం చేశారు. వాటిని మేము సరిచేస్తూ వస్తున్నాము. సీతారామ ప్రాజెక్టుకు 67 టిఎంసి లు కేటాయించేలా సిడబ్యూసి తో చర్చలు జరుపుతున్నాం. సమ్మక్క సారక్క బ్యారేజ్ ఎన్వోసీ కోసం ఛత్తీస్గఢ్ ను ఒప్పిస్తాం. ఉత్తుత్తి హామీలు మేము ఇవ్వము, చెప్పింది చేసి తీరుతాం. ఫార్మ్ హౌజ్ లో కూర్చొని నిర్ణయాలు తీసుకోము. 24 గంటలు ప్రజలకు, అధికారులకు అందుబాటులో ఉంటాం. దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ బిల్లులు త్వరలో చెల్లిస్తాం. ధరలు పెరగడంతో భూసేకరణ ఇబ్బందిగా మారింది. పారదర్శకంగా భూసేకరణ చేస్తాము. ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రత్యేక ఐఏఎస్ అధికారిణి నియమిస్తున్నం. ఇరిగేషన్ శాఖ బలోపేతం కోసం 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను నియమించాము. 1800 లస్కర్లను తీసుకోబోతున్నాం. ఆపరేషన్ మైంటేనెన్స్ కోసం1100 కోట్లు కేటాయిస్తాము. అన్ని ప్రాజెక్టులకు డిసిల్టింగ్, డీసెడిమెంట్ అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి చేయబోతున్నాం' అని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.

# 'టీటీడీ' తరహాలో యాదాద్రి గుడి బోర్డు: సీఎం రేవంత్



హైదరాబాద్: యాదగిరిగుట్ట దేవాలయం అభివృద్ధిపై అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. యాదాద్రి గుడి అభివృద్ధి పనులపై సీఎం శుక్రవారం (ఆగస్టు30) సచివాలయంలో రివ్యూ చేశారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిలో పెండింగ్ పనుల వివరాలు ఇవ్వాలని సీఎం అధికారులను కోరారు. భక్తుల సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టమైన వివరాలు అందించాలని ఆదేశించారు. ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి పనులు అర్ధంతరంగా వదిలేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిని మరో స్థాయికి తీసుకెళ్లాలని సీఎం సూచించారు

# మానవత్వ పరిమళం



చాలామంది స్వార్థ ప్రయోజనాల కోసమో, వ్యాపార లావాదేవీల కోసమో, వ్యక్తిగత ప్రయోజనాల కోసమో మనుషులతో సంబంధాలు మంచిగా ఉండాలని కోరుకుంటారు. ఇలాంటి సంబంధాల వల్ల మనుషుల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు ఉండవు. అందుకే మానవులంతా ఒకే జాతిగా ఐక్యతతో, అభివృద్ధి సాగించే దిశలో ఉండేటట్టు ఉండాలి. మానవత్వం, జాలి, దయ, క్షమాగుణం, దానగుణాలు మనుషులకు సహజగుణాలుగా ఉండాలి. ఇవన్నీ ఉండి సాటి మానవులకు అవసరమైనప్పుడు సాయం చేస్తుంటే చాలు, అదే మనుషుల మధ్య మంచి సంబంధాలకు దారి తీస్తుంది. కష్టాల్లో ఉన్నపుడు వారి కన్నీళ్లను తుడిచి వారికి అవసరమైన సాయం చేసినప్పుడే మనం మనుషులుగా మిగులుతాం. మానవత్వంతో మెలగడమంటే ఇదే. మానవుడు సంఘజీవి. దానివల్లనే మానవులమధ్య సంబంధాలు, బాంధవ్యాలు బలంగా ఉంటాయి. పరస్పర సహాయ సహకారం లేకుండా మనుగడ సాగించడం అసాధ్యం. మానవ సంబంధాలనేవి పటిష్టంగాను, పవిత్రంగాను ఉంటే మానవ ప్రగతి ఇతోధికంగా పెరుగుతుంది. అవి ఒకవేళ అపవిత్రాలు కళంకితాలుగా ఉంటే మాత్రం మానవ మనుగడ ప్రగతిపథంవైపుకు కాదు, అసలు నడకనే కుంటు పడుతుంది. మనుషుల మధ్య ఏర్పడే మానవ సంబంధాలు మానవత్వంతో ముడిపడి ఉండాలి. విచక్షణ, ఆలోచనాశక్తి ఉన్న మానవుడు మానవీయ విలువలతో సంబంధాలను పటిష్ఠం చేసుకోవాలి. అపుడే బాధలు లేని సుఖమయ జీవితం సాధ్యమవుతుంది. కేవలం రక్తసంబంధం ఉంటేనే వారితో మంచి స్నేహసంబంధం కలిగి ఉండడం కాక ప్రతి మనిషిని స్నేహహస్తంతో స్వాగతించాలి. కేవలం మానుషులనే కాక ఇతర జంతుకోటిని కూడా ప్రేమతోనే మచ్చిక చేసుకోవాలి. మనుషులతో పాటు ఎన్నో విధాలుగా సహాయం అందించే జంతుప్రాణి కూడా మనకు అవసరమైనదే. ప్రకృతి అంతా సమతౌల్యతతో ఉండాలంటే మానవులే కాక చెట్టు చేమలతో పాటుగా జంతుజాలం కూడా మంచి మనుగడ సాగించాల్సిందే. అప్పుడే మానవాళి ప్రగతి సజావుగా సాగుతుంది. చాలామంది స్వార్థ ప్రయోజనాల కోసమో, వ్యాపార లావాదేవీల కోసమో, వ్యక్తిగత ప్రయోజనాల కోసమో మనుషులతో సంబంధాలు మంచిగా ఉండాలని కోరుకుంటారు. ఇలాంటి సంబంధాల వల్ల మనుషుల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు ఉండవు. అందుకే మానవులంతా ఒకే జాతిగా ఐక్యతతో, అభివృద్ధి సాగించే దిశలో ఉండేటట్టు ఉండాలి. మానవత్వం, జాలి, దయ, క్షమాగుణం, దానగుణాలు మనుషులకు సహజగుణాలుగా ఉండాలి. ఇవన్నీ ఉండి సాటి మానవులకు అవసరమైనప్పుడు సాయం చేస్తుంటే చాలు, అదే మనుషుల మధ్య మంచి సంబంధాలకు దారి తీస్తుంది. కష్టాల్లో ఉన్నపుడు వారి కన్నీళ్లను తుడిచి వారికి అవసరమైన సాయం చేసినప్పుడే మనం మనుషులుగా మిగులుతాం. మానవత్వంతో మెలగడమంటే ఇదే. అయితే రానురాను మనుషుల్లో మానవత్వం కనుమరుగవుతుంది. మనుషులమనే విషయాన్ని మరిచి మృగాల్లా మారిపోతున్నారు. నోరులేని అమాయక అడవి బిడ్డల్ని సైతం తమ స్వార్థప్రయోజనాలకు వాడుకుంటున్నారు. చెంచు మహిళ ఈశ్వరమ్మ ఘటనే దీనికి నిదర్శనం. సాటి మానవులను తనలాంటి వారు అని గుర్తించక వారిని నీచంగా చూస్తున్నారు. హింసించి ఆనందిస్తున్నారు. ఇలాంటి వారిలో మృగాలు తప్ప మనుషులు ఎలా కనిపిస్తారు? ఈ విషయాన్ని ఎవరికి వారు ఆలోచించుకుని ఆత్మపరిశీలన చేస్తే అర్థమవుతుంది. 'మానవసేవే మాధవసేవ' అన్నట్లుగా మానవులందరూ మిత్రులవ్వాలంటే ఒకరికోసం ఒకరు నిలబడాలి. అదే జీవన సంబంధం. శరీరం శాశ్వతం కాకపోవచ్చు. మనం చేసే చర్య శాశ్వితం. ఎపుడైతే మానవత్వం మరిచిపోతామో అపుడు అన్యాయం పెచ్చు మీరుతుంది. అప్పుడే పిల్లి కూడా పులౌతుంది అనేది నిజమవుతుంది. అణిచివేత నుండే పోరాటం పుడుతుంది. శతాబ్దాలుగా ఇది చరిత్ర చెబుతున్న సత్యం. కనుక మనుషులుగా పుట్టినందుకు అందరూ విలువల్ని పాటిస్తూ మానవీయతతో మెలిగితే చాలు. ప్రపంచంలో ఎలాంటి సమస్యలూ ఉండవు. మనలోని ప్రేమను పెంచుకుంటే మానవత్వం అంకురిస్తుంది. ఆ అంకురమే విచ్చుకుని మానవత్వ పరిమళాలను వెదజల్లుతుంది.

# నైపుణ్యాలను ఎంచుకోవడంపై ఆలోచన చేయండి




మీ అభివృద్ధి దిశగా ప్రయాణాన్ని ప్రారంభించడానికి ముందుగా బలాలు, బలహీనతలను గుర్తించండి. మీరు వేటిలో మెరుగ్గా ఉన్నారు, ఎక్కడ వెనకబడి ఉన్నారో ఆత్మపరిశీలన చేసుకోండి. ఎక్కడైతే మీరు లోటుగా ఉన్నట్లు భావిస్తున్నారో, ఏయే రంగాలలో ఇంకా మెరుగుపడాలని భావిస్తున్నారో వాటిపై దృష్టి సారించండి. దీనికోసం నైపుణ్యాల ఎంపిక కూడా చాలా కీలకమని గుర్తుపెట్టుకోండి. మీ బలాలు, బలహీనతల గురించి సరైన అవగాహన కలిగి ఉంటే, మీరు అభివృద్ధి చేయాలనుకుంటున్న నైపుణ్యాలను ఎంచుకోవడంపై ఆలోచన చేయండి. మీ బలమైన నైపుణ్యాలపై పనిచేస్తూ వాటిని తదుపరి స్థాయికి తీసుకెళ్లాలనుకుంటున్నారా లేక బలహీనంగా ఉన్న నైపుణ్యాలను సానపెట్టాలనుకుంటున్నారా లేక కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలనుకుంటున్నారా అనేది ముందే నిర్ణయించుకోండి. నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి మార్గాలను వెతకడం వ్యక్తిగత వృద్ధికి మొదటి మెట్టు. మిమ్మల్ని మీరు నవీకరించుకుంటూ ఉంటే మీ లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చు, ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవచ్చు, కెరీర్లో పురోగతి సాధించవచ్చు, జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చు. కొందరు చదువు పూర్తవగానే ఇక మనం నేర్చుకోవాల్సింది ఏం లేదు అని అనుకుంటారు. కానీ ఇది సరైనది కాదు. నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియ. నేటి పోటీ ప్రపంచంలో ఎంత నేర్చుకున్నా, ఏం నేర్చుకున్నా తక్కువే. జీవితంలో వ్యక్తిగతంగా, వృత్తిగతంగా పురోభివృద్ధి సాధించాలంటే ఎప్పటికప్పుడు మన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి, కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ ఉండాలి. మీ అభివృద్ధి దిశగా ప్రయాణాన్ని ప్రారంభించడానికి ముందుగా బలాలు, బలహీనతలను గుర్తించండి. మీరు వేటిలో మెరుగ్గా ఉన్నారు, ఎక్కడ వెనకబడి ఉన్నారో ఆత్మపరిశీలన చేసుకోండి. ఎక్కడైతే మీరు లోటుగా ఉన్నట్లు భావిస్తున్నారో, ఏయే రంగాలలో ఇంకా మెరుగుపడాలని భావిస్తున్నారో వాటిపై దృష్టి సారించండి. దీనికోసం నైపుణ్యాల ఎంపిక కూడా చాలా కీలకమని గుర్తుపెట్టుకోండి. మీ బలాలు, బలహీనతల గురించి సరైన అవగాహన కలిగి ఉంటే, మీరు అభివృద్ధి చేయాలనుకుంటున్న నైపుణ్యాలను ఎంచుకోవడంపై ఆలోచన చేయండి. మీ బలమైన నైపుణ్యాలపై పనిచేస్తూ వాటిని తదుపరి స్థాయికి తీసుకెళ్లాలనుకుంటున్నారా లేక బలహీనంగా ఉన్న నైపుణ్యాలను సానపెట్టాలనుకుంటున్నారా లేక కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలనుకుంటున్నారా అనేది ముందే నిర్ణయించుకోండి. మీరు ఏ నైపుణ్యాన్ని ఎంపిక చేసుకున్నా అది మీరు మరింత ప్రభావవంతంగా పనిచేయడానికి, మీ లక్ష్యాన్ని సాధించడానికి, మీ కెరీర్లో ముందుకు సాగడానికి సహాయపడేదై ఉండాలి. మీరు ఎంచుకున్న నైపుణ్యాలపై మీ అంచనా అంత కచ్చితమైనది కాకపోవచ్చు. కాబట్టి ఈ మార్గంలో మీ సందేహాలు తీర్చడానికి, అపోహలను తొలగించడానికి మీ స్నేహితులు, కుటుంబ సభ్యులు, సహోద్యోగులతో మాట్లాడండి. వారు మీకు ఏ నైపుణ్యాలను మెరుగుపరచాలని సిఫార్సు చేస్తారో అభిప్రాయాన్ని అడగండి. ఇక్కడ మీరు ఓ విషయం కచ్చితంగా గుర్తుపెట్టుకోవాలి. మీ పనితీరు బాగాలేదని మీపై ఎవరైనా విమర్శలు చేస్తే వాటిని వ్యక్తిగత దాడిగా తీసుకోకండి. వారికి విరుద్ధంగా ప్రవర్తించకండి. ఇతరులు చెప్పేది ప్రశాంతంగా వినండి, దానిపై చర్చించండి. ఇతరుల విమర్శలు, సూచనలను తార్కిక దృక్కోణం నుండి విశ్లేషించడానికి ప్రయత్నించండి. అవి సరైన పాయింట్ని హైలైట్ చేస్తున్నాయో లేదో చూడండి. మీరు నిజమేనని భావిస్తే ఆ విమర్శలను స్వీకరించి మీ నైపుణ్యాలను మెరుగుపరుచుకోడానికి సిద్ధం కండి. నిజం కాదనిపిస్తే వదిలేయండి. కానీ ముందు వినడం మాత్రం నేర్చుకోండి. నైపుణ్యాలను నేర్చుకోవడమే కాదు, వీటిని సాధన చేయడం కూడా ముఖ్యమే. ఏ వస్తువునైనా ఉపయోగించకుండా ఉంటే అది కొంతకాలానికి తుప్పుపట్టడమో, పనిచేయకుండానో పోతుంది. నైపుణ్యం అయినా అంతే. మీరు వాడకుండా ఉంచే నైపుణ్యం సాధన చేయకపోతే కొంతకాలానికి నిరుపయోగంగా మారుతుంది. అప్పుడు నేర్చుకుని కూడా లాభం లేదు. కాబట్టి మీరు ఏదైనా ఒక నిర్దిష్ట విషయంలో నైపుణ్యం సాధించాలనుకుంటే నిరంతరం శిక్షణ పొందాలి. ఉదాహరణకు మీరు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరుచుకున్నారు, అప్పుడు ఎవరితోనైనా మాట్లాడితేనే, మీ భావాలను వ్యక్తపరిస్తేనే మీ స్కిల్స్ మరింత మెరుగుపడతాయి. ప్రాక్టీస్ లేకపోతే ఉన్న స్కిల్స్ కూడా పోతాయి.

# పాలనలో పారదర్శకత




ప్రభుత్వ ఉత్తర్వు (జిఓ)ల సమాచారాన్ని ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా గవర్నమెంట్ ఆర్డర్స్ ఇష్యూ రిజిస్టర్ (జిఓఐఆర్) వెబ్ పోర్టల్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగినది. ఈ నిర్ణయంతో కీలకమైన ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం కలుగుతుంది. జిఓఐఆర్ పోర్టల్ కొత్తదేం కాదు. ఈ వెబ్ పోర్టల్ 2008లో మొట్టమొదట ప్రజానీకానికి అందుబాటులోకి వచ్చింది. అంతకు ముందు వరకు వివిధ అంశాలపై జిఓలను సంపాదించడం ఒక పెద్ద ప్రహసనంగా ఉండేది. ప్రభుత్వ ఉత్తర్వులు అమలులోకి వచ్చిన నెలల తరువాత కూడా సామాన్యులకు అవి అందుబాటులోకి వచ్చేవి కావు. జిఓఐఆర్ వెబ్‌పోర్టల్ ఆవిష్కరణతో ఆ ఇబ్బందులు కొంత మేర తప్పాయి. రాజశేఖరరెడ్డి అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాధి నేతలు కూడా దీనిని కొనసాగించారు. అయితే, జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికింది. 2021 ఆగస్టు 15 నుండి జిఓఐఆర్ వెబ్ పోర్టల్‌ను నిలిపి వేసింది. దీంతో ప్రజలతో సంబంధం ఉన్న అనేక ప్రభుత్వ నిర్ణయాలు గుట్టుచప్పుడు కాకుండా అమలులోకి రావడం ప్రారంభమైంది. దీనిపై ప్రజానీకంతో పాటు పలు తరగతుల ఉద్యోగుల్లో సైతం తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. చివరకు హైకోర్టు జోక్యం చేసుకుని ఆదేశాలిచ్చినా ఫలితం దాదాపు శూన్యమే! తాజాగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం జిఓఐఆర్ వెబ్‌పోర్టల్‌ను నేటి (గురువారం) నుండే ప్రజలకు అందుబాటులోకి ఉంచాలని నిర్ణయించింది. అయితే, జిఓఐఆర్ వెబ్‌పోర్టల్ పునరుద్ధరణతోనే పాలనలో నూరు శాతం పారదర్శకత వచ్చేసినట్టు, జవాబుదారీతనానికి పెద్దపీట వేసినట్టు జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదు. నిజానికి ఇది ఆ దిశలో ఒక అడుగు మాత్రమే! గతంలో జిఓఐఆర్ పోర్టల్ ఉన్నప్పటికీ 'కాన్ఫిడెన్షియల్' జిఓలు జారీ అయ్యాయి. గత ప్రభుత్వం కొంత కాలంపాటు ఈ పోర్టల్‌లోనే ఖాళీ పేజీలను ఉంచింది. అందువల్ల పోర్టల్ పునరుద్ధరణతోనే పారదర్శకత వచ్చేసినట్లు కాదు. దానిలో అన్ని రకాల జిఓలను ఏమాత్రం దాపరికం లేకుండా ప్రభుత్వం విడుదల చేయగలగాలి. అప్పుడు కూడా పారదర్శకత వచ్చినట్టు కాదు. 'పాలనలో పారదర్శకత' అంటే మరింత విశాలమైన అర్థంతో కూడుకున్నది! పారదర్శకత సుపరిపాలన యొక్క ప్రధాన సూత్రం. పారదర్శకత అంటే కేవలం సమాచారాన్ని పంచుకోవడం మాత్రమే కాదు. మరింత 'ఓపెన్'గా వ్యవహరించడం! అంటే, తీసుకున్న నిర్ణయాలను తెలియచేయడం మాత్రమే కాదు! నిర్ణయాలు తీసుకోక ముందే చర్చించడం. నిర్ణయాలను ఎందుకు తీసుకోవాల్సి వచ్చింది? ఆ ప్రతిపాదన మీద ఎవరెవరు ఎలా స్పందించారు? భవిష్యత్ పరిణామాలేంటి అన్న అంశాలను కూడా అందుబాటులోకి ఉంచడం! కచ్చితమైన సమాచారాన్ని సకాలంలో, సంపూర్ణంగా, బాధ్యులైన వారి ద్వారా ప్రజలకు అందించడం కూడా సుపరిపాలనలో భాగమే! అప్పుడే ఆ సమాచారాన్ని పౌరసమాజం సమర్థవంతంగా వినియోగించగలుగుతుంది. ఒక్క జిఓ లకే కాదు. అన్ని రకాల ప్రభుత్వ నిర్ణయాలకు, కార్యక్రమాలకూ ఇది వర్తిస్తుంది. అంతర్రాష్ట్ర సమస్యలు, కేంద్రం నుండి ప్రత్యేకహెూదా, విభజన హామీల సాధన మొదలు రాజధాని నిర్మాణం వంటి అంశాలను అఖిలపక్షంలో చర్చించి అన్ని రాజకీయ పార్టీలు, సంస్థల ఉమ్మడి అభిప్రాయాన్ని సాధించడం కూడా పారదర్శక పాలనలో భాగమే. ఈ విషయంలో కోవిడ్, వరదల వంటి వాటితో పాటు ఇటీవల వయనాడ్ విలయం వరకు అనేక సందర్భాల్లో కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఆదర్శం.

విశాఖలో భూ కబ్జాలపై గతంలో టిడిపి తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వాలు ప్రత్యేక దర్యాప్తు బృందాల్ని (సిట్) నియమించాయి కాని వాటి నివేదికలను బహిర్గతం చేయలేదు. ఇప్పటికైనా వాటిని వెల్లడించాలి. కార్మికుల ప్రాణాలు బలిగొంటున్న ప్రమాదాలు, వాటిని అరికట్టడానికి వివిధ కమిటీలు చేసిన సిఫార్సులు లోకానికి తెలియాలి. ఇలా ప్రజలకు అవసరమైన ప్రతి అంశం (దేశ భద్రతకు ముప్పు ఉంటే తప్ప) ప్రజల ముందుకు రావాలి. విస్తృతంగా చర్చ జరగాలి. అలా జరిగేట్టు చూసే బాధ్యత ప్రభుత్వానిదే! పారదర్శకతకు పట్టం, జవాబుదారీతనానికి పెద్ద పీట అప్పుడే!

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215